


కూటమి ప్రభంజనం

58.9 శాతం ఓట్లతో స్థానిక ఎన్నికలలో ఘన విజయం


- 2024 ఎన్నికలతో పోలిస్తే 3.6 శాతం పెరిగిన ఓట్ల వాటా
- 100 పట్టణ స్థానిక సంస్థల్లో 94 చోట్ల పాగా...
- 3,941 వార్డుల్లో 3,233 క్లీవసం
- పల్లెల్లోనూ అదే జోరు... ఒక్క జెడ్పీ వినా 27 కూటమి క్లీవసం
- మహిళలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, యువతకు నాయకత్వంలో పెద్దపీట
- మరో 30 ఏళ్లకు సరిపోయేలా కొత్త నాయకత్వాన్ని తయారు చేశాం
- స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, ఫలితాల విశ్లేషణలను వివరించిన చంద్రబాబు

2



స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు ఘన విజయం సాధించాయని, 2024 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ప్రజల్లో కూటమి ఆదరణ మరింత పెరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఎన్నికల ఫలితాలు, వివిధ స్థాయిల్లో కూటమి సాధించిన విజయాలు, అభ్యర్థుల ఎంపికలో అనుసరించిన విధానం, సామాజిక ప్రాతినిధ్యానికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో గణాంకాలతో సహా వివరించారు.

ప్రజల విజ్ఞతే ఫలితాలు



- ప్రభుత్వ కష్టాన్ని గుర్తించి ఆశీర్వదించారు
- రెండున్నరేళ్ల సుపరిపాలనకు స్థానిక ఎన్నికల తీర్పు నిదర్శనం
- కొన్నిచోట్ల ఓటమిపై సమీక్ష... తప్పులు సరిదిద్దుకుంటాం
- కుప్పంలో ఓ ఎంపీటీసీ స్థానం ఓడినా... ప్రజాతీర్పును గౌరవించాం
- ప్రజల కోసం కష్టపడితే వెన్నంటే ఉంటారని నిరూపించారు
- గుడ్ గవర్నెన్స్ లీడ్స్ టు గుడ్ పాలిటిక్స్ మా విధానం
- క్షేత్రస్థాయిలో కూటమి పార్టీల ఐక్యతకు అద్దం పట్టేలా ఫలితాలు
- స్థానిక ఎన్నికల ఫలితాలపై మీడియాతో సీఎం చంద్రబాబు

గుడ్ గవర్నెన్స్ లీడ్స్ టు గుడ్ పాలిటిక్స్. ఇది నా నమ్మకం. సుపరిపాలన అందిస్తే ప్రజలు రాజకీయంగానూ ఆదరిస్తారనడానికి ప్రస్తుత ఎన్నికల ఫలితాలే నిదర్శనం.
-చంద్రబాబు నాయుడు


స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేశారని... తమ కోసం కష్టపడుతున్న ప్రభుత్వాన్ని గుర్తించి అండగా నిలిచారన్నారు సీఎం చంద్రబాబు నాయుడు. రెండున్నరేళ్ల సుపరిపాలనకు, అభివృద్ధికి ఆమోదం తెలిపారని... స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు అందించిన ఘనవిజయం ప్రభుత్వ పనితీరుకు లభించిన గుర్తింపు అని చంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల ఫలితాలపై సోమవారం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు.

- వివరాలు 3 లో..

సామాజిక, ఆర్థిక భద్రతలో ఏపీ
ఫ్రంట్ రన్నర్

- యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్థానం
- తలసరి ఆదాయంలో 13వ స్థానం... అయినా అవకాశాల కల్పనలో రెండో స్థానం
- ఆదాయానికి మించి ప్రజలకు సేవలు, సౌకర్యాలు అందించడంలో ఏపీ ప్రత్యేకం
- సెంటర్ ఫర్ న్యూ ఎకనామిక్ స్టడీస్ నివేదికపై సీఎం చంద్రబాబు

4





ఏపీ పారిశ్రామిక ప్రగతికి
నూతన దశ దిశ

నేవిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్ థీమ్‌తో సీఐఐ సమ్మిట్

- వాణిజ్యం నుంచి క్వాంటం వరకూ ఆరు అంశాలపై చర్చ
- 58 దేశాల నుంచి ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధుల హాజరు
- ఇప్పటికే 6 ప్రాంతీయ సదస్సుల్లో రూ.86వేల కోట్ల ఒప్పందాలు
- నవంబరు 12నుంచి విశాఖ వేదికగా 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు
- ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు అమిత్ షా, పీయూష్ గోయెల్
- హాజరుకానున్న దిగ్గజ కంపెనీల చైర్మన్‌లు, సీఈఓలు

4



అగ్నిప్రమాదాలపై సీఎం ఆరా

- రాజాం, గన్నవరం, తిరువూరుల్లో అగ్నిప్రమాదాలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం

2

అభివృద్ధి, సంక్షేమానికి ప్రజల పట్టం



- విజయంతో మా బాధ్యత మరింత పెరిగింది
- ప్రజల తీర్పును గౌరవించకుండా వైసీపీ నేతల దిగజారుడు రాజకీయాలు
- మాజీ ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి 'మర్డర్ అఫ్ డెమోక్రసీ' వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా
- మేకపాటి కుటుంబ, రాజకీయ చరిత్ర మొత్తం నేరపూరితమే
- దేవాదాయ మంత్రి ఆనం

5

వైసీపీ అరాచక రాజకీయాలకు
సమాధి కట్టిన ప్రజలు



- కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమానికి బ్రహ్మరథం
- మీడియా సమావేశంలో మంత్రి నిమ్మల

6

ప్రతిష్టాత్మకంగా
విశాఖ భాగస్వామ్య సదస్సు

- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

5

స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభంజనం

58.9 శాతం ఓట్లతో ఘన విజయం

- **2024 ఎన్నికలతో పోలిస్తే 3.6 శాతం పెరిగిన ఓట్ల వాటా**
- **100 పట్టణ స్థానిక సంస్థల్లో 94 చోట్ల పాగా... 3,941 వార్డుల్లో 3,233 కైవసం**
- **పల్లెల్లోనూ అదే జోరు... ఒక్క జెడ్పీ వినా 27 జెడ్పీలు కూటమి కైవసం**
- **మహిళలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, యువతకు నాయకత్వంలో పెద్దపీట**
- **మరో 30 ఏళ్లకు సరిపోయేలా కొత్త నాయకత్వాన్ని తయారు చేశాం**
- **స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, ఫలితాల విశ్లేషణలను వివరించిన చంద్రబాబు**



అమరావతి (చైతన్య రథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు ఘన విజయం సాధించాయని, 2024 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ప్రజల్లో కూటమి ఆదరణ మరింత పెరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఎన్నికల ఫలితాలు, వివిధ స్థాయిల్లో కూటమి సాధించిన విజయాలు, అభ్యర్థుల ఎంపికలో అనుసరించిన విధానం, సామాజిక ప్రాతినిధ్యానికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో గణాంకాలతో సహా వివరించారు. పట్టణ, పరిషత్ ఎన్నికల్లో కలిపి కూటమి 58.9 శాతం ఓట్లను సాధించిందని, 2024 ఎన్నికల్లో సాధించిన 55.3 శాతం ఓట్లతో పోలిస్తే 3.6 శాతం పెరుగుదల నమోదైందని వివరించారు. అదే సమయంలో వైసీపీ ఓట్ల శాతం 39.81 నుంచి 33.56కు పడిపోయిందని, ఆ పార్టీకి 6.25 శాతం ఓట్లు తగ్గాయని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో కూటమికి, వైసీపీకి మధ్య ఓట్ల శాతంలో 25.34 శాతం వ్యత్యాసం ఉందని వెల్లడించారు. పట్టణ స్థానిక సంస్థల్లో కూటమికి 59.9 శాతం ఓట్లు రాగా, వైసీపీకి 34.3 శాతం మాత్రమే వచ్చాయని సీఎం చంద్రబాబు తెలిపారు. పట్టణాల్లో కూటమి స్ట్రైక్ రేట్ 94 శాతంగా నమోదైందన్నారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమికి 57.6 శాతం, వైసీపీకి 39.7 శాతం ఓట్లు వచ్చాయని, కూటమి స్ట్రైక్ రేట్ 87.5 శాతంగా ఉందని వివరించారు. పట్టణాల్లో కూటమి, వైసీపీ ఓట్ల శాతం మధ్య 25.6 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 17.9 శాతం వ్యత్యాసం ఉందన్నారు. పట్టణాల్లో కూటమికి 65.7 శాతం పోస్టల్ బ్యాలెట్లు రాగా, వైసీపీకి 27.42 శాతం వచ్చాయని చెప్పారు. పరిషత్ ఎన్నికల్లో కూటమికి 62.83 శాతం, వైసీపీకి 31.46 శాతం పోస్టల్ బ్యాలెట్లు లభించాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ ఓట్ల శాతాలు చూస్తేనే.. ఉద్యోగులతో సహా అన్ని వర్గాలు కూటమిని ఏ స్థాయిలో ఆదరించారో అర్థం చేసుకోవచ్చన్నారు. బాగా పని చేసిన ఉద్యోగులు, అధికారుల పనితీరును బహిరంగంగానే ప్రశంసిస్తోన్న విషయాన్ని ప్రెస్‌మీట్‌లో గుర్తు చేశారు.

తిరుగులేని విజయాలు... తిరుగులేని మెజార్టీలు

రాష్ట్రవ్యాప్తంగా 659 జెడ్పీటీసీ స్థానాలకుగాను కూటమి 575 స్థానాలను కైవసం చేసుకుందని ముఖ్యమంత్రి తెలిపారు. మొత్తం 28 జిల్లాల్లో 27 జిల్లాల్లో కూటమి ఆధిక్యత సాధించిందని, అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రమే వైసీపీ కూటమి కంటే ఎక్కువ స్థానాలు సాధించిందని వివరించారు. ఏడు జిల్లాల్లో వైసీపీకి ఒక్క జెడ్పీటీసీ స్థానం కూడా దక్కలేదని చెప్పారు. అనకాపల్లి, కోనసీమ, కాకినాడ, మార్కాపురం, పల్నాడు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల్లో వైసీపీ ఖాతా తెరవలేకపోయిందన్నారు. ఎంపీటీసీ ఎన్నికల్లో మొత్తం 9,818 స్థానాలకు గాను కూటమి 7,803 స్థానాలను గెలుచుకుందని, రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం మండల అధ్యక్ష స్థానాలను కూటమి కైవసం చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిందని ముఖ్యమంత్రి చెప్పారు. మొత్తం 100 మేయర్, చైర్‌పర్సన్ పదవులకు గాను 94 స్థానాలను కూటమి గెలుచుకుందని, 13 మేయర్ పదవుల్లో 12, 87 చైర్‌పర్సన్ పదవుల్లో 82 దక్కించుకుందని తెలిపారు. ఇందులో టీడీపీ 70, జనసేన 20, బీజేపీ నాలుగు మేయర్, చైర్‌పర్సన్ పదవులను సాధించాయని ముఖ్యమంత్రి వివరించారు. మొత్తం 3,941 వార్డులకుగాను 3,233 వార్డుల్లో కూటమి జయకేతనం ఎగురవేసిందని, ఇది 82 శాతమని పేర్కొన్నారు. 100 పట్టణ స్థానిక సంస్థల్లో 95 చోట్ల కూటమికి కౌన్సిల్ మెజారిటీ లభించిందని, 16 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రతి వార్డునూ కూటమి గెలుచుకుందని చెప్పారు. మరోవైపు వైసీపీ 100 పట్టణ స్థానిక సంస్థల్లో కేవలం నాలుగు చోట్లే విజయం సాధించిందని, 3,941 వార్డుల్లో 558 స్థానాలకే పరిమితమైందని తెలిపారు. 22 పట్టణ స్థానిక సంస్థల్లో వైసీపీ ఒక్క వార్డు కూడా గెలుచుకోలేకపోయిందని వివరించారు.

దశాబ్దాల తర్వాత పులివెందులలో స్వేచ్ఛగా పోలింగ్


విశాఖలో 2,47,817 ఓట్ల మెజారిటీ, విజయవాడలో 1,30,872 ఓట్లు, గుంటూరులో 96,294 ఓట్ల ఆధిక్యంతో కూటమి విజయం సాధించిందని ముఖ్యమంత్రి తెలిపారు. పులివెందులలో సైతం కూటమి 13,875 ఓట్ల మెజారిటీతో చైర్‌పర్సన్ పదవిని కైవసం చేసుకుందని, మొత్తం 40 వార్డుల్లో 37 గెలుచుకుందని చెప్పారు. కడప కార్పొరేషన్‌లో 65,588 ఓట్ల మెజారిటీతో విజయం సాధించడంతో పాటు 66 వార్డుల్లో 64 స్థానాలను కూటమి గెలుచుకుందని వివరించారు. కడప జిల్లాలో రౌడీ రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడారని, జిల్లాలోని తొమ్మిది పట్టణ స్థానిక సంస్థలూ కూటమి ఖాతాలోకి వచ్చాయని సీఎం చంద్రబాబు అన్నారు. కడప జిల్లాలో 345 వార్డులకు గాను వైసీపీ కేవలం తొమ్మిది స్థానాలకే పరిమితమైందని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే ఫలితాలు ఇలాగే ఉంటాయని ముఖ్యమంత్రి అన్నారు. అనంతపురంలో మేయర్ పదవి దక్కకపోయినా కార్పొరేటర్లలో ఎక్కువ మంది కూటమి తరఫున గెలిచారని పేర్కొన్నారు.

మహిళలకు 60 శాతం... బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 62.9 శాతం ప్రాతినిధ్యం

మేయర్లు, చైర్‌పర్సన్ల ఎంపికలో మహిళలకు, వెనుకబడిన వర్గాలకు, సామాజికంగా అణగారిన వర్గాలకు, మైనారిటీలకు పెద్దపీట వేశామని ముఖ్యమంత్రి తెలిపారు. టీడీపీ నుంచి గెలిచిన 70 మంది మేయర్లు, చైర్‌పర్సన్లలో 42 మంది మహిళలేనని, అంటే 60 శాతం ప్రాతినిధ్యం కల్పించామని వివరించారు. టీడీపీ గెలిచిన పది మేయర్ పదవుల్లో ఎనిమిది స్థానాల్లో మహిళలే బాధ్యతలు చేపట్టనున్నారని చెప్పారు. విశాఖ, విజయనగరం, మచిలీపట్నం, గుంటూరు, ఒంగోలు, కడప, కర్నూలు, చిత్తూరు నగరాలకు మహిళలు నాయకత్వం వహించనున్నారని తెలిపారు. టీడీపీ నుంచి ఎన్నికైన 70 మంది మేయర్లు, చైర్‌పర్సన్లలో 44 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందినవారని, మొత్తంగా ఈ వర్గాలకు 62.9 శాతం ప్రాతినిధ్యం కల్పించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. బీసీలకు 25 పదవులు, ఎస్సీలకు తొమ్మిది, మైనారిటీలకు తొమ్మిది, ఎస్టీలకు ఒక పదవి దక్కిందన్నారు. మొత్తం 27 సామాజిక వర్గాలకు చెందినవారు టీడీపీ తరఫున మేయర్లు, చైర్‌పర్సన్లుగా ఎన్నిక కావడం సామాజిక న్యాయానికి నిదర్శనమని పేర్కొన్నారు. టీడీపీ నుంచి ఎన్నికైన పది మంది మేయర్లు పది విభిన్న సామాజిక వర్గాలకు చెందినవారని, వీరిలో నలుగురు బీసీలు, నలుగురు ఓసీలు, ఒకరు ఎస్సీ, మరొకరు మైనారిటీ వర్గానికి చెందినవారని తెలిపారు. మేయర్లు, చైర్‌పర్సన్లలో తొమ్మిది మంది ముస్లిం మైనారిటీలు ఉండగా, వారిలో ఆరుగురు మహిళలేనని సీఎం చంద్రబాబు చెప్పారు.

యువతకు అవకాశాలు... విద్యావంతులకు ప్రోత్సాహం

పట్టణ స్థానిక సంస్థల నాయకత్వంలో యువతకు, విద్యావంతులకు ప్రాధాన్యం ఇచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. టీడీపీ నుంచి గెలిచిన 70 మంది మేయర్లు, చైర్‌పర్సన్లలో 55 మంది డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హతలు కలిగినవారని, వీరిలో 11 మంది పీజీ చదివినవారని వివరించారు. అంటే 78.6 శాతం మంది ఉన్నత విద్యావంతులేనని చెప్పారు. 31 మంది 45 ఏళ్లలోపు వారని, ఎనిమిది మంది 35 ఏళ్లలోపు వారని సీఎం తెలిపారు. పది మంది టీడీపీ మేయర్ల సగటు వయసు 39 సంవత్సరాలని పేర్కొన్నారు. రాజంపేటలో 26 ఏళ్ల డాక్టర్ దొంతం గాయత్రి, మచిలీపట్నంలో 29 ఏళ్ల షేక్ అబ్దుల్ అబీదా, విజయనగరంలో 31 ఏళ్ల అవనాపు భార్గవి, విశాఖలో 32 ఏళ్ల డాక్టర్ ముక్కా శ్రావణి మేయర్లుగా ఎన్నిక కావడం యువతకు ఇచ్చిన అవకాశాలకు నిదర్శనమన్నారు. ఒంగోలులో 27వ డివిజన్ నుంచి 24 ఏళ్ల చావలి చార్విత కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారని చెప్పారు. ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నవారు, అత్యంత నిరుపేదలు, రోజువారీ కూలీలు, రాజకీయ నేపథ్యం లేనివారు, సమాజంలో మంచి పేరున్నవారు ఇలా విభిన్న నేపథ్యాల నుంచి వచ్చినవారికి నాయకత్వ అవకాశాలు కల్పించామని ముఖ్యమంత్రి తెలిపారు. రాజకీయాల్లో తాము చేసిన ప్రయోగాలు అద్భుతమైన ఫలితాలను ఇచ్చాయని, భవిష్యత్తులో మరో 30 ఏళ్ల పాటు పార్టీకి, రాష్ట్రానికి సేవలందించేలా కొత్త నాయకత్వాన్ని తయారు చేశామని చెప్పారు. మహిళలు, యువత, బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించడమే కాకుండా, పట్టణ పాలనలోనూ వారి భాగస్వామ్యాన్ని పెంచామని వివరించారు. స్థానిక ఎన్నికల ఫలితాలు కేవలం కూటమి విజయాన్నే కాకుండా, సామాజిక న్యాయం, కొత్త నాయకత్వ నిర్మాణం, ప్రజాస్వామ్యానికి ప్రజలు ఇచ్చిన మద్దతును కూడా ప్రతిబింబిస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.



అగ్నిప్రమాదాలపై సీఎం ఆరా

- రాజాం, గన్నవరం, తిరువూరుల్లో అగ్నిప్రమాదాలు

- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సీఎం ఆదేశం

అమరావతి (చైతన్య రథం): విజయనగరం జిల్లా రాజాం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు అగ్ని ప్రమాదాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. రాజాంలోని ఓ ఆటోమొబైల్ షోరూమ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో భారీగా ఆస్తినష్టం సంభవించింది. దీపావళి టపాసులు ప్రమాదవశాత్తు షోరూమ్‌పై పడి మంటలు అంటుకోవటంతో షోరూమ్ దగ్ధమైంది. ఈ ఘటనలో ఆస్తి నష్టం చోటుచేసుకుంది. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేసినట్టు అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

కృష్ణా జిల్లా గన్నవరంలో బాణా సంచా కాలుస్తుండగా నిప్పు రవ్వలు ఎగిరిపడి ఓ ఫర్నిచర్ దుకాణానికి మంటలు అంటుకున్నాయి. తిరువూరులోని మరో దుకాణంలోనూ షార్ట్ సర్క్యూట్ సంభవించి దుకాణం దగ్ధమైంది. మంటల కారణంగా ఆస్తినష్టం జరగటంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. ఈ మూడు ఘటనలపై ఆరా తీసిన సీఎం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు జారీ చేశారు.

చైతన్యరథం

ప్రజలు విజ్ఞత ప్రదర్శించారు...
ప్రభుత్వ కష్టాన్ని గుర్తించి ఆశీర్వదించారు

- **రెండున్నరేళ్ల సుపరిపాలనకు స్థానిక ఎన్నికల తీర్పు నిదర్శనం**
- **కొన్ని చోట్ల ఓటమిపై సమీక్ష... తప్పులు సరిదిద్దుకుంటాం**
- **కుప్పంలో ఓ ఎంపీటీసీ స్థానం ఓడినా... ప్రజాతీర్పును గౌరవించాం**
- **ప్రజల కోసం కష్టపడితే వెన్నంటే ఉంటారని నిరూపించారు**
- **గుడ్ గవర్నెన్స్ లీడ్స్ టు గుడ్ పాలిటిక్స్ మా విధానం**
- **క్షేత్రస్థాయిలో కూటమి పార్టీల ఐక్యతకు అద్దం పట్టేలా ఫలితాలు**
- **స్థానిక ఎన్నికల ఫలితాలపై మీడియాతో సీఎం చంద్రబాబు**



అమరావతి (చైతన్య రథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేశారని... తమ కోసం కష్టపడుతున్న ప్రభుత్వాన్ని గుర్తించి అండగా నిలిచారన్నారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. రెండున్నరేళ్ల సుపరిపాలనకు, అభివృద్ధికి ఆమోదం తెలిపారని... స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు అందించిన ఘనవిజయం ప్రభుత్వ పనితీరుకు లభించిన గుర్తింపు అని చంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల ఫలితాలపై సోమవారం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... గుడ్ గవర్నెన్స్ లీడ్స్ టు గుడ్ పాలిటిక్స్ అన్నది తన నమ్మకమని, సుపరిపాలన అందిస్తే ప్రజలు రాజకీయంగానూ ఆదరిస్తారనడానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని చెప్పారు. 2024 సాధారణ ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు కూటమికి ప్రజల ఆదరణ మరింత పెరిగిందని, వైసీపీని గతంలో కంటే ఎక్కువగా ప్రజలు తిరస్కరించారని తెలిపారు. పట్టణ స్థానిక సంస్థలు, పరిషత్ ఎన్నికలు.. ఈవీఎంలు, బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్లు.. ఏవిధంగా చూసినా ప్రజల మద్దతు కూటమికే లభించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు కూటమి వైపు మొగ్గు చూపారని, అనకాపల్లి, కోనసీమ, కాకినాడ, పల్నాడు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల్లో వైసీపీ ఒక్క జెడ్పీటీసీని కూడా గెలుచుకోలేకపోయిందని సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రజలు కేవలం పార్టీలను మాత్రమే కాకుండా, అభ్యర్థుల గుణగణాలను, వారి నేపథ్యాన్ని కూడా విశ్లేషించి ఓటు వేశారన్నారు. పెళ్లి సంబంధం

> *గుడ్ గవర్నెన్స్ లీడ్స్ టు గుడ్ పాలిటిక్స్. ఇది నా నమ్మకం. సుపరిపాలన అందిస్తే ప్రజలు రాజకీయంగానూ ఆదరిస్తారనడానికి ప్రస్తుత ఎన్నికల ఫలితాలే నిదర్శనం.*
>
> **– సీఎం చంద్రబాబు నాయుడు**

కుదుర్చుకునేటప్పుడు అటు ఏడు తరాలు.. ఇటు ఏడు తరాలు చూస్తామని, అదేవిధంగా ప్రజలు కూడా తమ తరఫున పనిచేసే వ్యక్తుల గురించి ఆలోచించి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని, ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించారన్నారు. రాష్ట్ర ప్రజలు తమపై ఉంచిన విశ్వాసానికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని సీఎం పేర్కొన్నారు.

అండగా ఉన్నాం... ఆశీర్వాదం పొందాం

రెండున్నరేళ్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు, గత పాలనలో జరిగిన విధ్వంసం నుంచి పునరుద్ధరించేందుకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి పౌరుడికీ భద్రత, భరోసా కల్పిస్తూ సుపరిపాలన అందిస్తున్నామని, సాగునీటి ప్రాజెక్టులతో సీమ కరవుకు చెక్ పెట్టామని, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు కల్పించామని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంటి పట్టాలు అందించామని, పేదలకు ఇళ్లు నిర్మించామన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు తానే శంకుస్థాపన చేశానని, ఇప్పుడు తొలిదశను ప్రారంభించి నీరందించడం ద్వారా రైతుల కష్టాలను తీర్చామని గుర్తు చేశారు. పోలవరం ఎడమ కాల్వ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకెళ్లామని చెప్పారు. దీన్ని ప్రజలు గుర్తించారని... ఓట్లతో ఆశీర్వదించారని సీఎం చంద్రబాబు అన్నారు. మార్కాపురంలో 21కి 21 జెడ్పీటీసీ స్థానాలను, అనకాపల్లిలో 24కి 24 స్థానాలను కూటమి గెలుచుకుందని గుర్తు చేశారు. విశాఖ మేయర్ స్థానాన్ని 2.50 లక్షల ఓట్ల మెజారిటీతో ప్రజలు కట్టబెట్టారని వివరించారు. ఇప్పుడే కాకుండా గతంలోనూ వివిధ సందర్భాల్లో ఇదే నిరూపితమైందని చెప్పారు. ప్రజల కోసం కష్టపడితే ప్రజలు ఆ పార్టీల వెన్నంటే ఉంటారని ఈ ఫలితాలు నిరూపించాయన్నారు.

> *ఆ వర్గం ఈ వర్గం, ఈ ప్రాంతం ఆ ప్రాంతం అని కాకుండా... పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా అన్నిచోట్లా ఒకే విధమైన ఫలితాలు వచ్చాయి. కూటమికి జనం నీరాజనం పలికారు. రెండున్నరేళ్ల రాష్ట్ర పునర్నిర్మాణ యజ్ఞ ఫలితాలను ప్రజలు అందుకుని కూటమికి స్థానిక సంస్థల ఎన్నికల్లో అఖండ విజయాన్ని కట్టబెట్టారు*
>
> **–ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక శ్రద్ధ

స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం వివిధ సామాజిక వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించామని ముఖ్యమంత్రి తెలిపారు. అన్ని కులాలకు రాజ్యాధికారంలో భాగస్వాములను చేసేలా అభ్యర్థుల ఎంపిక జరిగిందని చెప్పారు. మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కోసం విస్తృతంగా కసరత్తు చేసి, సమన్వయంతో ముందుకు వెళ్లామని చెప్పారు. రాజకీయ నేపథ్యం లేని సామాన్యులు కూడా ఈ ఎన్నికల్లో విజయం సాధించారని, ఇది రాజకీయాల్లో కొత్త ఒరవడికి నాంది అని పేర్కొన్నారు. సీట్లు దక్కకపోయినా కూటమి ధర్మానికి కట్టుబడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. త్యాగాలు చేసిన కేడర్‌ను, నాయకులను గుర్తించి గౌరవిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. టీడీపీ కేడర్ బేస్డ్ పార్టీ అని, సేవా భావమే తమ రాజకీయాలకు పునాది అని చెప్పారు. బీజేపీ, జనసేన, టీడీపీలు ఐక్యంగా పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని, ఇకముందూ కూటమి ధర్మాన్ని పాటిస్తూ ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు.

> *గత ప్రభుత్వంలో ఐదేళ్లపాటు విధ్వంసాన్ని యదేచ్ఛగా సాగించారు. జరిగిన విధ్వంసాన్ని వివరిస్తూ 7 శ్వేత పత్రాలు విడుదల చేశాం. స్వర్ణాంధ్ర విజన్‌తో పాలన మొదలెట్టాం. పేదరిక నిర్మూలన దగ్గర నుంచి డీప్ టెక్ వరకూ యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని పని చేశాం.*
>
> **– మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు**

అవసరమైతే కఠినంగా వ్యవహరిస్తాం

రాష్ట్రవ్యాప్తంగా కూటమి ఘన విజయం సాధించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఎదురైన ఓటములపై సమగ్రంగా సమీక్షించుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అనంతపురంలో ఓడిపోయే అవకాశమే లేదని... కానీ అక్కడ ఓటమి ఎదురైందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన ఫలితాలు రాలేదని చెప్పారు. అరకు కాఫీ బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంతో పాటు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పనిచేశామని తెలిపారు. అయినప్పటికీ అక్కడ ఫలితాలు ఎందుకు అనుకూలంగా రాలేదో విశ్లేషిస్తామని, ఓటర్లపై ఏమైనా ప్రలోభాల ప్రభావం పడిందా అనే విషయాలను కూడా వాస్తవాల ఆధారంగా పరిశీలిస్తామని చెప్పారు. ఒకట్రెండు స్థానాల్లో ఎందుకు ఓడిపోయామో లోతుగా విశ్లేషించుకుని, అవసరమైతే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఎక్కడ పొరపాట్లు జరిగినా సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్తామని, తమకు ఎలాంటి భేషజాలు లేవని అన్నారు. మెజారిటీ పెరిగినప్పుడు మరింత అప్రమత్తంగా, బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుందని పార్టీ నాయకులకు సూచించారు. కూటమి నిర్ణయాలను ఉల్లంఘించి వ్యవహరించిన వారిని ఉపేక్షించబోమని, రెబల్స్‌ను తిరిగి పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

గొడ్డలి పార్టీ కుట్రలకు చెక్...

కూటమి ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేసేందుకు వైసీపీ అనేక ప్రయత్నాలు చేసిందని ముఖ్యమంత్రి విమర్శించారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్ఐఆర్ ప్రక్రియ, డీలిమిటేషన్ వంటి అంశాలపై పిటిషన్లు వేసి స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు ప్రయత్నించిందని అన్నారు. అయితే వారి ప్రయత్నాలకు సుప్రీంకోర్టు చెక్ పెట్టిందని తెలిపారు. ఎన్నికలు ఆపాలన్న వైసీపీ ట్రాప్‌లో పడబోమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కూటమి ప్రజలను, వారి నమ్మకాన్ని మాత్రమే విశ్వసించిందని, వైసీపీ మాత్రం హింసాత్మక రాజకీయాలను నమ్ముకుందని విమర్శించారు. రక్తతర్పణాలు, రప్పరప్పా రాజకీయాలను ప్రజలు ఎప్పుడూ ఆమోదించరని, రౌడీయిజం, డ్రామాలతో ప్రజాతీర్పును మార్చలేరని అన్నారు. రెండు తుఫాన్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలోనూ వైసీపీ కనీసం రాజకీయ పార్టీగా స్పందించలేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో మావిగన్ ప్రకటనకు కూడా ప్రజలు తమ తీర్పు ద్వారా సమాధానం ఇచ్చారని వ్యాఖ్యానించారు. డబ్బు ప్రభావం లేకుండా జరిగిన ఈ ఎన్నికల్లో గెలుపొందిన వారందరికీ అభినందనలు తెలిపారు. గెలిచిన వారిపై ప్రజల పట్ల బాధ్యత మరింత పెరిగిందని, ఎన్నికలతో తమ బాధ్యత ముగిసిపోలేదని, నిరంతరం ప్రజల కోసం పనిచేస్తూనే ఉంటామని చెప్పారు.

సాఫీగా సాగిన ఎన్నికల ప్రక్రియ... అయినా విమర్శలా..?

ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉన్నవారు ప్రజాతీర్పును గౌరవిస్తారని, నమ్మకం లేని వారే కుట్రలకు పాల్పడతారని వైసీపీపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగినప్పటికీ వైసీపీ అర్థం పర్థం లేని ఆరోపణలు చేసిందని అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములను సహజంగా స్వీకరించాలన్నారు. కుప్పంలో ఒక ఎంపీటీసీ స్థానాన్ని కూటమి కోల్పోయినప్పటికీ, కక్కుర్తి పడలేదని వెల్లడించారు. దాన్ని బలవంతంగా కైవసం చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆ స్థానాన్ని ఎలాగైనా గెలుచుకోవాలనే పంతానికి పోలేదని, ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేస్తేనే అసలైన ప్రజాభిప్రాయం తెలుస్తుందని పేర్కొన్నారు. ప్రజల నిర్ణయాన్ని గౌరవించాలనే తమ విధానానికి కుప్పం ఎంపీటీసీ ఫలితమే నిదర్శనమని ముఖ్యమంత్రి చెప్పారు.

> *తెలుగుదేశం పార్టీ కేడర్ బేస్డ్ పార్టీ. నాయకులు పార్టీ మారినా కార్యకర్త జెండా దించరు. అలాంటి కార్యకర్తలు ఉన్న పార్టీ టీడీపీ. రాజకీయాల్లో నూతన ఒరవడికి ఎన్డీఏ శ్రీకారం చుట్టింది. డబ్బులతో కాదు... సేవాభావంతో రాజకీయాలు చేయాలి. ఎన్నికల్లో డబ్బుల ఖర్చు తగ్గిస్తే నాయకుల్లో సేవాభావం పెరుగుతుంది. ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటారు*
>
> **– మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు**


శ్వేతపత్రాలు టు ప్రగతి నివేదికలు

గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు వివరించేందుకు శ్వేతపత్రాలు విడుదల చేశామని, వ్యవస్థలను గాడిలో పెట్టి ఇప్పుడు ప్రగతి నివేదికలు సమర్పిస్తున్నామని అన్నారు. రాయలసీమను అభివృద్ధి సీమగా మార్చేందుకు సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలను తీసుకొచ్చామని, సూపర్ ఎల్‌నినో వంటి తీవ్ర వాతావరణ పరిస్థితుల్లోనూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 36 ప్రాజెక్టులను పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టామని చెప్పారు. రాష్ట్రానికి పూర్తిగా దెబ్బతిన్న బ్రాండ్‌ను తిరిగి సూపర్ బ్రాండ్‌గా తీర్చిదిద్దామని తెలిపారు. ఒకసారి రాష్ట్రానికి మంచి బ్రాండ్ ఇమేజ్ వస్తే పెట్టుబడులు వాటంతట అవే వస్తాయని చెప్పారు. ప్రజలు ఇచ్చిన తీర్పు తమకు మరింత బాధ్యతను పెంచిందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనను కొనసాగిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలోనూ రాజకీయాల కంటే ప్రజల కష్టాలకే ప్రాధాన్యమిచ్చామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించారని ముఖ్యమంత్రి చెప్పారు.

చైతన్యరథం

సామాజిక, ఆర్థిక భద్రతలో ఏపీ ఫ్రంట్ రన్నర్

- **యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్థానం**
- **తలసరి ఆదాయంలో 13వ స్థానం... అయినా అవకాశాల కల్పనలో రెండో స్థానం**
- **ఆదాయానికి మించి ప్రజలకు సేవలు, సౌకర్యాలు అందించడంలో ఏపీ ప్రత్యేకం**
- **సెంటర్ ఫర్ న్యూ ఎకనామిక్ స్టడీస్ నివేదికపై సీఎం చంద్రబాబు**



అమరావతి (చైతన్య రథం): ప్రజలకు అందుబాటులో ఉన్న అవకాశాలు, మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, సామాజిక భద్రత వంటి అంశాల్లో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో విశిష్ట స్థానాన్ని సాధించింది. యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్ ఏఈఐ-2026లో దేశంలోని 28 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ న్యూ ఎకనామిక్స్ స్టడీస్ (సీఎన్ఈఎస్) రూపొందించి విడుదల చేసిన నివేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. తమ ప్రభుత్వం గత రెండున్నరేళ్ల కాలంలో చేపడుతున్న పరిపాలనకు అద్దం పట్టేలా ఈ నివేదిక ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సూచీ రాష్ట్రాల ఆర్థిక సంపదతో పాటు ప్రజలకు దక్కుతున్న సమాన అవకాశాలు, పౌరులకు అవసరమైన సేవలు అందించేందుకు ఆ సంపదను ప్రభుత్వాలు ఎంత సమర్థంగా వినియోగిస్తున్నాయన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకుని రూపొందించిందని చెప్పారు. గోవా 0.68 స్కోరుతో మొదటి స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ 0.66 స్కోరుతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. సిక్కిం 0.63, కేరళ 0.60, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు 0.57 స్కోరుతో ఏపీ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ సూచీ ఆధారంగా సెంటర్ ఫర్ న్యూ ఎకనామిక్స్ స్టడీస్ ఏపీను ఫ్రంట్ రన్నర్ రాష్ట్రంగా గుర్తించింది. దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో ఏపీ అత్యధిక ర్యాంకు సాధించడం విశేషం. ఐదు ప్రధాన అంశాల ఆధారంగా ఈ సూచీని రూపొందించారు. ప్రాథమిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, సామాజిక-ఆర్థిక భద్రత, న్యాయ సేవలు వంటి అంశాలను ఇందులో పరిశీలించారు. మొత్తం 23 విభాగాల్లోని 60 సూచికలను పరిగణనలోకి తీసుకున్నారు. ప్రతి అంశానికి సమాన ప్రాధాన్యమిచ్చారు. ఈ ఐదు అంశాల్లో సామాజిక, ఆర్థిక భద్రత విభాగంలో ఏపీ దేశంలోనే మొదటి స్థానాన్ని సాధించింది. ఈ విభాగంలో ఏపీ 0.69 స్కోరు సాధించగా, రెండో స్థానంలో ఉన్న గోవా 0.50 స్కోరుకే పరిమితమైంది. మిగిలిన నాలుగు విభాగాల్లోనూ దేశంలో అగ్రరాష్ట్రాల జాబితాలో ఏపీ నిలిచింది.

సంపద కంటే అవకాశాల కల్పనే కీలకం

తలసరి ఆదాయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో 13వ స్థానంలో ఉన్నప్పటికీ, ప్రజలకు అవకాశాలు కల్పించడంలో మాత్రం రెండో స్థానంలో నిలవటం ఈ నివేదికలో ఆసక్తికరమైన అంశంగా స్పష్టమవుతోంది. రాష్ట్ర ఆర్థిక స్థాయిని బట్టి అంచనా వేసిన యాక్సెస్ స్కోరు 0.51 కాగా, వాస్తవంగా సాధించిన స్కోరు 0.66గా నమోదైంది. అంటే రాష్ట్ర ఆదాయ స్థాయితో పోలిస్తే అంచనాలకు మించి 0.15 పాయింట్లు అధిక స్కోరు ఏపీ సాధించింది. ఆదాయానికి, అవకాశాల కల్పనకు మధ్య ఉన్న ఈ సానుకూల వ్యత్యాసం దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఏపీలోనే అత్యధికంగా నమోదైంది. కేరళలో 0.07, హిమాచల్ ప్రదేశ్‌లో 0.06 తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఒక రాష్ట్రం ఎంత సంపద సృష్టిస్తుందన్నది ఒక్కటే అభివృద్ధికి కొలమానం కాదని, ఆ సంపదను ప్రజలకు అవసరమైన అవకాశాలుగా మలచటమే ముఖ్యమని ఈ నివేదిక తేల్చి చెప్పింది. తాగునీరు, పారిశుద్ధ్యం, గృహవసతి, స్వచ్ఛమైన ఇంధనం, వైద్య సదుపాయాలు, విద్య, ఉపాధి, బ్యాంకింగ్, బీమా, పింఛన్లు, న్యాయ సేవలు ఎంతమేర ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్న అంశాల ఆధారంగా రాష్ట్రాల పనితీరును అంచనా వేసింది.

సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలే కూటమికి అండ

సంపద సృష్టి కోసం పెట్టుబడులు తీసుకురావటంతో పాటు ప్రజలకు మెరుగైన పాలన అందించటం, అవకాశాలను అన్‌లాక్ చేయటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించటం వల్లే కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలిచారని పేర్కొన్నారు. యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్ 2026లో దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల్లో ఏపీ రెండవ స్థానంలో నిలవటం గర్వకారణమని సీఎం వ్యాఖ్యానించారు. జీవన ప్రమాణాలు సహా వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని చేసిన ఈ ఇండెక్స్‌లో ఏపీ అగ్రస్థానంలో నిలిచేలా పనిచేసిన అందరికీ అభినందనలు తెలిపారు. సోషియో ఎకనామిక్ సెక్యూరిటీ, మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం సహా వనరులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. కుటుంబం నుంచి కమ్యూనిటీ ఆస్తుల వరకూ పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాలుగా మన ఏపీ ముందంజలో ఉందన్నారు. ప్రతి ప్రాంతానికీ, వర్గానికీ చేరువగా పాలన, అభివృద్ధి అందుతుందన్నారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు అండగా నిలిచారని సీఎం వ్యాఖ్యానించారు.

ఏపీ పారిశ్రామిక ప్రగతికి నూతన దశ దిశ

- **నేవిగేటింగ్ న్యూవరల్డ్ ఆర్డర్ థీమ్‌తో సీఐఐ సమ్మిట్**
- **వాణిజ్యం నుంచి క్వాంటం వరకూ ఆరు అంశాలపై చర్చ**
- **58 దేశాల నుంచి ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధుల హాజరు**
- **ఇప్పటికే 6 ప్రాంతీయ సదస్సుల్లో రూ.86వేల కోట్ల ఒప్పందాలు**
- **నవంబరు 12నుంచి విశాఖ వేదికగా 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు**
- **ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు అమిత్ షా, పీయూష్ గోయెల్**
- **హాజరుకానున్న దిగ్గజ కంపెనీల చైర్మన్‌లు, సీఈఓలు**

అమరావతి (చైతన్య రథం): నేవిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్ థీమ్‌తో విశాఖ వేదికగా ఈనెల 12, 13 తేదీల్లో రెండు రోజుల పాటు 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు జరుగనుంది. మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు నూతన దశాదిశ అందించేలా పెట్టుబడుల సదస్సు విశాఖలో ఆవిష్కృతం కానుంది. కేవలం పెట్టుబడుల ఆకర్షణకు మాత్రమే పరిమితం కాకుండా వాణిజ్యం నుంచి క్వాంటం వరకూ వివిధ అంశాలపై మేథోమథనం నిర్వహించి.. ఫలితాలను ముందుకు తీసుకెళ్లేలా భాగస్వామ్య సదస్సులో చర్చలు జరుగనున్నాయి. సీఎం చంద్రబాబు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా కేంద్రమంత్రులు, అంతర్జాతీయ పారిశ్రామిక, వాణిజ్య దిగ్గజ కంపెనీల ప్రతినిధులు సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరు కానున్నారు. దాదాపు 58 దేశాలకు చెందిన ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధులు కూడా సదస్సుకు హాజరయ్యేందుకు ఇప్పటికే నమోదు చేసుకున్నారు. ప్రపంచ మార్కెట్లతో ఏపీ పరిశ్రమల్ని అనుసంధానించటమే లక్ష్యంగా భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రపంచ పెట్టుబడులు, అంతర్జాతీయ వాణిజ్యం, సాంకేతిక భాగస్వామ్యాలకు ఏపీను కీలక కేంద్రంగా నిలిచేలా సదస్సులో చర్చలు, ఒప్పందాలు జరుగనున్నాయి. మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వాణిజ్యం, సాంకేతికత, పరస్పర విశ్వాసం, నిపుణుల దార్శనిక ఆలోచనలకు ప్రాధాన్యమిస్తూ చర్చలు సాగనున్నాయి. ప్రపంచ దేశాలతో భారత ఆర్థిక భాగస్వామ్యానికి ప్రధాన వేదికగా సదస్సును 1995నుంచి ఏటా నిర్వహిస్తున్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని డీపీఐఐటీతో కలిసి భారత పరిశ్రమల సమాఖ్య సీఐఐ సదస్సును నిర్వహిస్తోంది. ఈ పెట్టుబడుల సదస్సుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆతిథ్యమిస్తోంది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ సమ్మిట్‌కు అధ్యక్షత వహించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహాధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. 58 దేశాల ప్రాతినిధ్యం, 16మంది విదేశీ మంత్రులు, 40మంది అంతర్జాతీయ స్థాయి ప్రతినిధులు సమ్మిట్‌కు హాజరు కానున్నారు. సింగపూర్, నేపాల్, కంబోడియా, మయన్మార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కెనడా, స్లోవాక్ రిపబ్లిక్, మారిషస్, మొజాంబిక్, ఈజిప్ట్, అల్జీరియా, టాంజానియా, గ్వాటెమాలా తదితర దేశాల ప్రభుత్వ ప్రతినిధులు సదస్సులో పాల్గొననున్నారు. వివిధ దేశాల రాయబారులు, పారిశ్రామిక ప్రముఖులు, సాంకేతిక నిపుణులతోపాటు వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్, ఏడీబీ, యునెప్‌లాంటి సంస్థల ప్రతినిధులు కూడా సదస్సుకు హాజరు కానున్నారు. సదస్సులో భాగంగా 400 పైచిలుకు బిజినెస్ టు బిజినెస్ సమావేశాలు నిర్వహించనున్నారు. దీంతోపాటు ప్రభుత్వాలతో పరిశ్రమల సంప్రదింపుల కోసం బీ టూ జీ సమావేశాలు జరుగనున్నాయి.

ఏపీ ఉమెన్ గ్రోత్ సమ్మిట్ -2026

పెట్టుబడుల సదస్సులో భాగంగా ఈనెల 11న పారిశ్రామిక ప్రతినిధుల మధ్య ముందస్తు సమావేశాలు జరుగనున్నాయి. అదే రోజు రాత్రి 8 గంటలకు ముఖ్యమంత్రి అధికారిక విందు ఇవ్వనున్నారు. విశాఖలోని ఆంధ్రా వర్శిటీ ఇంజనీరింగ్ కాలేజి గ్రౌండ్స్‌లో 12, 13 తేదీల్లో ప్రధాన సమావేశం నిర్వహించనున్నారు. దీనికి సమాంతరంగా ఏపీ ఉమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్ 2026 నిర్వహిస్తారు. 12వ తేదీ ఉదయం 9.30కు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పీయూష్ గోయెల్, సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, మంత్రి నారా లోకేష్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రతినిధి రాబర్టో తదితరులు సీఐఐ భాగస్వామ్య సదస్సును ప్రారంభించనున్నారు. ఇక నవంబర్ 13, సాయంత్రం 4 గంటలకు సదస్సు ముగింపు కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి చంద్రబాబు తదితరులు పాల్గొనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, వాల్యూచైన్, క్వాంటం టెక్నాలజీ, సెమీ కండక్టర్ సహా నూతన సాంకేతికతలు, అంతర్జాతీయ సహకారం, నైపుణ్యాలు, గ్రీన్ ఎనర్జీ, సుస్థిర పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం, ఆహార భద్రత, జీవ ఆధారిత ఆర్థిక వ్యవస్థ తదితర అంశాలపై సుదీర్ఘ చర్చలు జరగనున్నాయి. గత పెట్టుబడుల సదస్సు సహా వివిధ సందర్భాల్లో ఒప్పందాలను పారిశ్రామిక ప్రాజెక్టులుగా మలిచేందుకు మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో మంత్రులు, అధికారుల కమిటీని నియమించింది. ఈ కమిటీ ఎప్పటికప్పుడు ప్రాజెక్టుల గ్రౌండింగ్‌ను పర్యవేక్షిస్తోంది. ఇప్పటికే రూ.6 లక్షల కోట్ల విలువైన 272 ప్రాజెక్టులు రాష్ట్రంలో ప్రారంభమయ్యాయి. మరో రూ.17 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం ఇచ్చింది. 2025-26లో దేశంలోనికి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 25.6 శాతం ఏపీ దక్కించుకుంది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా నిర్వహించిన 6 సన్నాహక ప్రాంతీయ సదస్సుల ద్వారా 194 ఎంఓయూల ద్వారా రూ.86,522 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. తద్వారా 1.47 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు వచ్చే అవకాశం ఉంది.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రజల పట్టం

- విజయంతో మా బాధ్యత మరింత పెరిగింది
- ప్రజల తీర్పును గౌరవించకుండా వైసీపీ నేతల దిగజారుడు రాజకీయాలు
- మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి 'మర్డర్ అఫ్ డెమోక్రసీ' వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా
- మేకపాటి కుటుంబ, రాజకీయ చరిత్ర మొత్తం నేరపూరితమే
- దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): సీఎం చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చూసిన ప్రజలు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టారని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఈ విజయం తమపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు.

సోమవారం నెల్లూరు నగరం సంతపేటలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల అమలు, సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నామని చెప్పారు.

ఆత్మకూరు నియోజకవర్గంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి ప్రజలు అద్భుతమైన విజయాన్ని అందించారని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఆత్మకూరు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఆత్మకూరు నుంచి పోటీ చేసి సుమారు 7 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించామని, అప్పటితో పోలిస్తే ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల మద్దతు గణనీయంగా పెరిగిందని వివరించారు.

ఆరు మండలాల్లో కూటమికి తిరుగులేని ఆధిక్యం

2024 ఎన్నికల ఫలితాలతో పోలిస్తే ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి వచ్చిన ఆధిక్యం ప్రజల్లో ప్రభుత్వంపై పెరిగిన విశ్వాసానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. మర్రిపాడు మండలంలో 2024 ఎన్నికల్లో టీడీపీకి 672 ఓట్ల లోటు ఉండగా, ప్రస్తుతం 743 ఓట్ల ఆధిక్యం లభించింది. సంగం మండలంలో గతంలో 3,290 ఓట్ల మెజారిటీ ఉండగా, ప్రస్తుతం 5,480 ఓట్లకు పెరిగింది. చేజర్ల మండలంలో గతంలో 2,214 ఓట్ల మెజారిటీ ఉండగా, ప్రస్తుతం 6,312 ఓట్ల ఆధిక్యం సాధించింది. అనంతసాగరం మండలంలో గతంలో 802 ఓట్ల లోటు ఉండగా, ప్రస్తుతం 392 ఓట్ల ఆధిక్యం వచ్చింది. ఏఎస్ పేట మండలంలో గతంలో 560 ఓట్ల లోటు ఉండగా, ప్రస్తుతం 1,228 ఓట్ల మెజారిటీ సాధించింది. ఆత్మకూరు రూరల్‌లో గతంలో 123 ఓట్ల మెజారిటీ ఉండగా, ప్రస్తుతం 1,813 ఓట్ల ఆధిక్యం లభించింది. ఆరు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో కలిపి సుమారు 18,174 ఓట్ల ఆధిక్యాన్ని ప్రజలు కూటమికి అందించారని మంత్రి తెలిపారు. 2024 ఎన్నికల్లో వచ్చిన ఓట్లతో పోలిస్తే కూటమి బలం గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు.

67 ఎంపీటీసీ స్థానాల్లో 58 టీడీపీ కైవసం

ఆరు మండలాల్లో మొత్తం 67 ఎంపీటీసీ స్థానాలకు గాను 58 స్థానాల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించగా, 9 స్థానాల్లో వైసీపీ గెలిచిందని మంత్రి వెల్లడించారు. మర్రిపాడు మండలంలో 13 స్థానాలకు 11, సంగం మండలంలో 13 స్థానాలకు 11, చేజర్ల మండలంలో 10 స్థానాలకు 10, అనంతసాగరం మండలంలో 12 స్థానాలకు 9, ఏఎస్ పేట మండలంలో 10 స్థానాలకు 9, ఆత్మకూరు మండలంలో 9 స్థానాలకు 8 స్థానాలను టీడీపీ కైవసం చేసుకుందని తెలిపారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డులకు గాను కూటమి 17 స్థానాలు, వైసీపీ 10 స్థానాలు, సీపీఎం ఒక స్థానాన్ని గెలుచుకున్నాయని వివరించారు. ఎన్నికల ద్వారా ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ బాధ్యతాయుతంగా ముందుకు సాగుతామని చెప్పారు.

ఓటమిని హుందాగా అంగీకరించాలి

ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ప్రజల తీర్పును ప్రతి రాజకీయ పార్టీ గౌరవించాల్సిన బాధ్యత ఉందని మంత్రి అన్నారు. తాను ఇప్పటివరకు పదిసార్లు ఎన్నికల్లో పోటీ చేయగా ఏడుసార్లు గెలిచి, మూడుసార్లు ఓటమి పాలయ్యానని గుర్తుచేశారు. ఓటమి ఎదురైన ప్రతిసారీ ప్రజల నిర్ణయాన్ని హుందాగా అంగీకరించి, భవిష్యత్తు కోసం పనిచేశానే తప్ప వ్యవస్థలను, అధికారులను నిందించలేదని తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో కూటమి సాధించిన విజయాన్ని జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు అసహనంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియను, అధికారులను, ఎన్నికల కమిషన్‌ను విమర్శించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో అపనమ్మకం కలిగించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. 2019లో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రతిపక్షాలకు జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో స్వేచ్ఛగా పోటీ చేసే పరిస్థితులు కల్పించారా అని ప్రశ్నించారు. అప్పటి పరిస్థితుల కారణంగానే తమ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. నాడు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచిన వారు నేడు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

'మర్డర్ ఆఫ్ డెమోక్రసీ' వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ప్రజాస్వామ్య వ్యవస్థను ఉద్దేశించి ఉపయోగించిన 'మర్డర్ ఆఫ్ డెమోక్రసీ' అనే పదజాలాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు. ప్రజలు ఓటు ద్వారా తీర్పునిచ్చిన ఎన్నికల ఫలితాలను ప్రజాస్వామ్య హత్యగా అభివర్ణించడం రాజ్యాంగ వ్యవస్థను, ఎన్నికల ప్రక్రియను అవమానించడమేనని అన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఎన్నికల కమిషన్, ఎన్నికల అధికారులు, రాజ్యాంగబద్ధ సంస్థలపై నిరాధార విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. ఈ వ్యాఖ్యలపై న్యాయ నిపుణులతో సంప్రదించి, చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలపై పరిశీలన జరుపుతామని తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థను కించపరిచే వ్యాఖ్యలపై చట్టపరమైన పరిధిలో చర్యలు తీసుకోవాలని సంబంధిత ప్రభుత్వ, న్యాయ వ్యవస్థల దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

మేకపాటి కుటుంబ, రాజకీయ చరిత్రపై మంత్రి విమర్శలు

మేకపాటి కుటుంబానికి చెందిన కొందరు నాయకులు గతంలో రాజకీయాల్లో వ్యవహరించిన తీరుపై మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. 1980, 1990 దశకాలలో ఆత్మకూరు, మర్రిపాడు ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనలు, పోలీస్ స్టేషన్‌పై దాడులు, రాజకీయ ప్రత్యర్థులపై దాడులు వంటి అంశాలను ప్రస్తావిస్తూ, ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే ముందు గత చరిత్రను ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

1996లో మాగుంట సుబ్బరామిరెడ్డి మరణానంతరం జరిగిన రాజకీయ పరిణామాలు, ఆయన కుటుంబ సభ్యులపై జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న దాడులు, 1998 ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలను కూడా మంత్రి ప్రస్తావించారు. రాజకీయాల్లో హింసకు తావులేదని, ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే రాజకీయ పోరాటం జరగాలని స్పష్టం చేశారు.

కేరళ రోడ్డు కాంట్రాక్టు వ్యవహారంపై ప్రశ్నలు

కృష్ణమోహన్ కన్స్ట్రక్షన్స్ (కేఎంసీ), గురువాయూర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన కేరళ రాష్ట్రంలోని జాతీయ రహదారి కాంట్రాక్టు వ్యవహారాన్ని మంత్రి ప్రస్తావించారు. పాలక్కాడ్ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం పూర్తయినట్లు చూపించి టోల్ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని, ఈ వ్యవహారంపై ఎన్‌హెచ్ఏఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు, జప్తుల గురించి వివరించారు. ఈడీ అధికారులు సుమారు రూ.125.21 కోట్ల విలువైన ఆస్తులు లేదా బ్యాంకు ఖాతాలను జప్తు చేసినట్లు మంత్రి తెలిపారు. అలాగే పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో కుటుంబ ఆస్తులకు సంబంధించిన నకిలీ పత్రాలు, ఫోర్జరీ ఆరోపణలపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదైనట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ అంశాలపై సంబంధిత వ్యక్తులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం

రాజకీయ విమర్శలు, ఆరోపణలకు ప్రజాసేవే సమాధానమని మంత్రి స్పష్టం చేశారు. గత రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో ప్రజల విశ్వాసాన్ని పొందామని చెప్పారు. ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో పాటు ఆధ్యాత్మిక ఆత్మకూరును కూడా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. మానవసేవే మాధవసేవ అనే నినాదంతో ప్రజలకు సేవలందిస్తామని, ప్రస్తుతం సాధించిన 18 వేల ఓట్ల ఆధిక్యాన్ని భవిష్యత్తులో 40 నుంచి 50 వేల ఓట్ల స్థాయికి తీసుకెళ్లేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి ఐక్యతతో ఆత్మకూరు నియోజకవర్గంలో పసుపు జెండాను మరింత బలోపేతం చేస్తామని, అభ్యర్థులు ఎవరైనా కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయడం తమ నాయకుల బాధ్యత అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు.

ప్రతిష్టాత్మకంగా విశాఖ భాగస్వామ్య సదస్సు

- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖపట్నంలో ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సును అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. సదస్సు ఏర్పాట్లపై స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో సోమవారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డా.డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి సమీక్ష నిర్వహించారు. నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్ , ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' థీమ్‌తో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సుమారు 59 దేశాల నుంచి ప్రతినిధులు, 15 మంది విదేశీ మంత్రులు హాజరయ్యే ఈ సదస్సు ఏర్పాట్లు అత్యంత పకడ్బందీగా ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా చేయాలన్నారు. మొత్తం 1,250 మందికి పైగా దేశీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, సీఈఓలు, పాలసీ మేకర్లు హాజరవుతారన్నారు. వాణిజ్యం, గ్రీన్ ఎనర్జీ, క్వాంటం కంప్యూటింగ్, టెక్నాలజీ ఇన్నోవేషన్, ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి ఆరు కీలక రంగాలపై సదస్సులో ప్రధానంగా చర్చలు జరుగుతాయన్నారు. గొడ్డలి పార్టీ హయాంలో రాష్ట్రం అన్ని విధాల నష్టపోయిందన్నారు. రాష్ట్ర సమగ్ర ఆర్థిక, పారిశ్రామిక ప్రగతిని పరుగులెత్తించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు.

వైసీపీ అరాచక రాజకీయాలకు సమాధి కట్టిన ప్రజలు

- కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమానికి బ్రహ్మరథం
- మీడియా సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు



పాలకొల్లు (చైతన్యరథం): నరకాసుర వధ అనంతరం దీపావళి సంబరాలు జరుపుకున్నట్లుగానే, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అరాచక రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడి విజయోత్సవాలు జరుపుకుంటున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచకాలు, అకృత్యాలకు ప్రజలు తమ ఓటుతో గట్టి సమాధానం చెప్పారని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. పనిచేసే ప్రభుత్వంపై ప్రజలు అపారమైన విశ్వాసాన్ని మరోసారి ఓట్ల రూపంలో చాటుకున్నారన్నారు. ప్రజలు ఇచ్చిన ఈ విజయాన్ని తమ గుండెల్లో పెట్టుకుంటామని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా మరింత బాధ్యతతో పనిచేస్తామని స్పష్టం చేశారు.

అరాచకాలు, అప్రజాస్వామిక విధానాలతో ప్రజల్లో వైసీపీ తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందని, చివరకు తన చర్యలతో తానే సెల్ఫ్ గోల్ వేసుకుందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు, ప్రశాంతమైన వాతావరణం నెలకొనాలంటే వైసీపీ అరాచక రాజకీయాలకు దూరంగా ఉండాలని ప్రజలు బలంగా ఆకాంక్షించారని అన్నారు. రప్పా రప్పా అంటూ హింసాత్మక రాజకీయాలు, విష సంస్కృతిని ప్రోత్సహించే వైసీపీకి ప్రజలు తమ తీర్పుతో శాశ్వతంగా సమాధి కట్టారని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, వారి తీర్పును గౌరవిస్తూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం మరింత కృషి చేస్తుందని మంత్రి తెలిపారు.

కేంద్రంలో, రాష్ట్రంలో కొనసాగుతున్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు మరింత బలాన్ని చేకూర్చాయని, ప్రజల తీర్పుతో ఇప్పుడు ట్రిపుల్ ఇంజిన్ ప్రభుత్వంగా మారిందని మంత్రి అభివర్ణించారు.

ముంపు బాధితులకు స్వచ్ఛమైన తాగునీరు



- 'బాలవికాస' సంస్థ కృషి అభినందనీయం
- కొనియాడిన మంత్రి కందుల దుర్గేష్
- నిడదవోలులో ప్రజలకు సురక్షిత నీటిని స్వయంగా పంపిణీ చేసిన మంత్రి

నిడదవోలు (చైతన్యరథం): అర్నబ్, మురసు తుఫాన్ల ధాటికి తీవ్రంగా దెబ్బతిన్న తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలోని 19వ వార్డు ఇందిరానగర్, తీరుగూడెం ప్రాంతాల్లోని వరద బాధితులకు 'బాలవికాస' సామాజిక సంస్థ ఆధ్వర్యంలో 'అమేజాన్' సహకారంతో ఉచితంగా సురక్షిత తాగునీటిని పంపిణీ చేసే కార్యక్రమాన్ని మంత్రి కందుల దుర్గేష్ సోమవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. స్వయంగా తన చేతుల మీదుగా బాధితులకు వాటర్ క్యాన్లను అందజేశారు..ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అర్నబ్, మురసు తుఫాన్ల విధ్వంసంతో స్వచ్ఛమైన నీరు దొరకక నిడదవోలు ప్రజలు పడుతున్న వేదన తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. ప్రజల ఆకలి, దాహం నా సొంత ఇంటి కష్టంగా భావించాను. వరద ముప్పులో ఉన్న నిడదవోలు ప్రజల నీటి కష్టాల గురించి తెలియగానే నా చిరకాల మిత్రుడు, బాలవికాస సంస్థ అధినేత శౌరిరెడ్డికి ఫోన్ చేశాను. ప్రజల బాధను వివరించగానే ఆయన ఏమాత్రం ఆలస్యం చేయకుండా, హైదరాబాద్ నుండి అత్యాధునిక 'మొబైల్ వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్' వాహనాన్ని నేరుగా నిడదవోలుకు పంపించారు. మురుగునీటిని సైతం స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన తాగునీరుగా మార్చే సాంకేతికతతో కూడిన ఈ వాహనం మన నిడదవోలుకు చేరుకొని బాధితులకు తాగునీటిని అందించడం నిజంగా దేవుడు పంపిన వరంగా భావిస్తున్నాను. సంస్థ ప్రతినిధి పుల్లారెడ్డి పర్యవేక్షణలో ఈ వాహనం మరో రెండు మూడు రోజుల పాటు తాళ్లపాలెం, ఇతర ప్రభావిత ప్రాంతాల్లో తిరుగుతూ ప్రతి ఒక్కరికీ నీరందిస్తుందని తెలిపారు.

ఇంకా ప్రమాణస్వీకారంచేయకుండానే మున్సిపల్ ఛైర్ పర్సన్‌కు, కౌన్సిలర్లకు ఈ తరహా సేవ చేసుకునే భాగ్యం దక్కడం అదృష్టమన్నారు. పదవుల కంటే ప్రజలక్షేమమే ముఖ్యమని భావించాలని వారికి సూచించారు.. విపత్కర పరిస్థితుల్లో రోగాలు,అంటువ్యాధులువ్యాపించకుండా ఉండాలంటే ప్రథమ కర్తవ్యం సురక్షిత నీటిని అందించడమేనని భావించి వెంటనే బాధిత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరును పంపిణీ చేశామని, ఇది చిట్టచివరి బాధితుడికి కూడా చేరుతుందన్నారు.

విద్యా రంగంలోనూ బాలవికాస సేవలు

సమాజ శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్న బాలవికాస సంస్థ త్వరలోనే ఒక విశ్వవిద్యాలయాన్ని స్థాపించబోతుండటం ఎంతో సంతోషదాయకం. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలిచిన బాలవికాస, అమెజాన్ సంస్థల యాజమాన్యానికి, సభ్యులకు నిడదవోలు ప్రజల తరఫున నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని మంత్రి దుర్గేష్ అన్నారు.

నిడదవోలు సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తా

రాబోయే రోజుల్లో అన్ని రకాల సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తూ, నిడదవోలు నియోజకవర్గాన్ని సర్వతోముఖాభివృద్ధి చేస్తానని, ఈ ప్రయాణంలో అహర్నిశలు శ్రమిస్తానని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు మున్సిపల్ ఛైర్‌పర్సన్ మురాల జ్యోతి, 19వ వార్డు కౌన్సిలర్ బయ్యా రామలక్ష్మి, ఇతర వార్డు కౌన్సిలర్లు, కూటమి నాయకులు, మంత్రి తనయుడు కందుల కృష్ణతేజ, తదితరులు పాల్గొని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు.

సుపరిపాలనకు జైకొట్టిన జనం

- స్థానిక పోరులో కూటమి జైత్రయాత్ర
- ముఖ్యమంత్రి చంద్రబాబుకి టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ నరేంద్రబాబు అభినందనలు


అమరావతి (చైతన్యరథం): మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో తెలుగుదేశం–జనసేన–బీజేపీ కూటమి అఖండ విజయంసాధించిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిసి ఎన్టీఆర్ విగ్రహ ప్రతిమను అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అమలు చేస్తున్న ప్రజానుకూల విధానాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఈ స్థానిక ఎన్నికల ఫలితాలే తిరుగులేని నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అపార అనుభవంతో కూడిన సుపరిపాలన, యువనేత నారా లోకేష్ దూకుడుగా చేపడుతున్న విద్యా, ఉపాధి సంస్కరణలు, పార్టీ శ్రేణుల్లో నింపుతున్న ఉత్సాహంపై ప్రజలు సంపూర్ణ విశ్వాసాన్ని చాటారని స్పష్టం చేశారు.ప్రభుత్వం అమలుచేస్తున్న 'సూపర్ సిక్స్' పథకాలు, పారదర్శక పాలన పట్ల గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలు హర్షం వ్యక్తంచేస్తూ కూటమి అభ్యర్థులకు ఏకపక్షంగా మద్దతు పలికారన్నారు. కూటమికి చెందిన నాయకులు, క్షేత్రస్థాయి



కార్యకర్తలు సమన్వయంతో కష్టపడి పనిచేసి ఈఘన విజయాన్ని సాధించారని, ప్రతి కార్యకర్త శ్రమ వెలకట్టలేనిదని నరేంద్రబాబు కొనియాడారు. కూటమి విజయానికి అహర్నిశలు శ్రమించిన నాయకులకు, కార్యకర్తలకు, ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచిన ప్రజలందరికీ ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఏపీ ఆధ్యాత్మిక వైభవానికి
జాతీయ స్థాయిలో గుర్తింపు

- ది వీక్ హెరిటేజ్ అవార్డుల్లో శ్రీశైలం, అహోబిలం ఆలయాలకు సిల్వర్ అవార్డులు
- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి హర్షం



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ఆధ్యాత్మిక వైభవానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ది వీక్ హెరిటేజ్ అవార్డుల్లో శ్రీశైలం, అహోబిలం ఆలయాలకు సిల్వర్ అవార్డులు దక్కాయి. రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం,అహోబిలం దేవస్థానాలకు ప్రతిష్ఠాత్మకమైన ది వీక్ హెరిటేజ్ అవార్డులు–2026లో సిల్వర్ అవార్డులు లభించడం పట్ల దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, భక్తులకు, దేవాదాయశాఖ అధికారులకు, ఆలయ సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. శ్రీశైలం దేవస్థానానికి స్పిరుచ్యువల్ టూరిజం విభాగంలో, అహోబిలం దేవస్థానానికి సస్టెయినబుల్ టూరిజం విభాగంలో సిల్వర్‌అవార్డులు లభించడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆధ్యాత్మిక, సాంస్కృతిక, వారసత్వ సంపదకు దక్కిన విశిష్ట గుర్తింపుగా మంత్రి అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ అనాదిగా ఆధ్యాత్మికతకు, ఆలయ సంప్రదాయాలకు, శిల్పకళా వైభవానికి నిలయంగా ఉందని, రాష్ట్రంలోని ప్రాచీన దేవాలయాలు కేవలం భక్తి కేంద్రాలే కాకుండా భారతీయ సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలకు సజీవ ప్రతీకలని పేర్కొన్నారు. ఈ అవార్డులు ఆంధ్రప్రదేశ్‌ను ఆధ్యాత్మిక పర్యాటక రంగంలో దేశవ్యాప్తంగా ప్రత్యేకంగా నిలబెడుతున్నాయని మంత్రి ఆనం తెలిపారు.

రాప్తాడు బాధితురాలు
గోపిక ఆరోగ్యం మెరుగు

- చిన్నపిల్లల అత్యవసర విభాగం నుంచి సాధారణ వార్డుకు తరలింపు
- గాయాలకు కట్లు మార్చిన వైద్యులు.. చికిత్సకు బాగా స్పందిస్తున్న బాధితురాలు
- ఎడమ చేతికి పట్టీ తొలగింపు.. మందులతో ఛాతీ నొప్పి నియంత్రణ

అమరావతి (చైతన్యరథం): రాప్తాడు ఘటనలో తీవ్రంగా గాయపడి బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు గోపిక ఆరోగ్యం మరింత మెరుగుపడింది. ఆమె ఆరోగ్య పరిస్థితి ఆశాజనకంగా ఉండటంతో చిన్నపిల్లల అత్యవసర చికిత్స విభాగం నుంచి సాధారణ వార్డుకు తరలించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. సోమవారం వైద్య బృందం మరోసారి గోపికకు గాయాలపై కట్లు మార్చింది. తల, మెడ, ముఖం, చేతులు, వీపుపై ఉన్న గాయాలకు డ్రెస్సింగ్ నిర్వహించారు. గాయాల పరిస్థితి మెరుగ్గా ఉందని, గోపిక చికిత్సను బాగా తట్టుకుంటున్నారని వైద్యులు తెలిపారు. ఎడమ చేతికి వేసిన పట్టీని తొలగించడంతో ఆమెచేతిని కదిలించుకునేందుకు సౌలభ్యం కలిగిందని పేర్కొన్నారు. అయితే దగ్గినప్పుడు ఛాతీలో నొప్పి వస్తుండటంతో మందుల ద్వారా దానిని నియంత్రిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. గోపిక ఆహారంతక్కువగా తీసుకుంటుండటంతోప్రస్తుతం ముక్కు ద్వారా గొట్టం సాయంతో ఆహారం అందిస్తున్నారు. నోటి ద్వారా ఆహారం తీసుకునేలా వైద్యులు ఆమెను ప్రోత్సహిస్తున్నారు.డాక్టర్ భాస్కర్ షెనాయ్ పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. ప్లాస్టిక్ సర్జరీ, ఆర్థోపెడిక్ విభాగాల వైద్యులు సమన్వయంతో ఆమెకు వైద్య సేవలు అందిస్తున్నారు.

నేటినుండి విజయవాడలో ఏపీహెచ్ఆర్సీ క్యాంపు కోర్టులు

అమరావతి(చైతన్యరథం):ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఏపీ హెచ్ఆర్సీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న క్యాంపు కోర్టు నిర్వహణలో భాగంగా చైర్మన్ జస్టిస్ ఎం సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుండి 13వ తేదీ వరకు విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో హెచ్ఆర్సీ క్యాంపు కోర్టు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు క్యాంప్ కోర్టునోడల్ అధికారి బొగ్గరం తారక నరసింహకుమార్ తెలిపారు ఈ క్యాంపు కోర్టులో ఎన్టీఆర్, కృష్ణా,ఏలూరు, పశ్చిమ గోదావరిజిల్లాలకు సంబంధించిన కేసుల విచారణలతోపాటు నూతన కేసుల స్వీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు ఈ క్యాంపు కోర్టు కార్యక్రమాల్లో హెచ్ఆర్సీ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న కేసుల్లోని ఆయా జిల్లాల అధికారులు విజయవాడ కేంద్రంగా నిర్వహించే ఈ క్యాంపు కోర్టుకి హాజరుకావాలని సూచించారు.

మానసిక దివ్యాంగుల మధ్య కుటుంబ సమేతంగా

- మంత్రి నిమ్మల దీపావళి సంబరాలు



పాలకొల్లు (చైతన్యరథం): మానసిక దివ్యాంగుల ముఖాల్లో చిరునవ్వులు నింపుతూ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కుటుంబ సమేతంగా దీపావళి వేడుకలు జరుపుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని అంజలి మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. విద్యార్థులకు మంత్రి నిమ్మల, ఆయన కుటుంబ సభ్యులు నూతన వస్త్రాలు, దీపావళి బాణసంచా సామాగ్రి, స్వీట్లు, పండ్లు అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి బాణసంచా కాల్చి వారిలో ఆనందోత్సాహాలు నింపారు. కుటుంబానికి దూరంగా వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులతో ఆప్యాయంగా గడుపుతూ వారిని సంతోషపరిచారు.

ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. అభం శుభం తెలియని చిన్నారులైన మానసిక దివ్యాంగ విద్యార్థులతో కలిసి దీపావళి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్న వీరితో కలిసి పండుగ జరుపుకోవడం ద్వారా తమ కుటుంబ సభ్యులతోనే దీపావళి జరుపుకున్నామనే ఆత్మీయ భావన వారిలో కలుగుతుందన్నారు. దైవ స్వరూపులైన మానసిక దివ్యాంగులను ఆదరించడం, అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు మానవతా దృక్పథంతో ముందుకొచ్చి ఇలాంటి విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు.

అనంతరం మంత్రి నిమ్మల కుటుంబ సభ్యులు గోమాతకు మేత వేసి పూజలు నిర్వహించారు. ఆప్యాయత, అనురాగాల మధ్య అంజలి పాఠశాలలో దీపావళి వేడుకలు ఆనందంగా సాగాయి.

వైద్య సేవల్లో పల్నాడు జిల్లా అగ్రస్థానం

- **అట్టడుగున కర్నూలు జిల్లా**
- **రాష్ట్రవ్యాప్తంగా 135 మంది వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు**
- **పీహెచ్‌సీల పనితీరుపై నివేదికను మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు నివేదించిన ప్రజారోగ్య సంచాలకులు**

అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వ పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవల పనితీరు మెరుగుపరచడంలో పల్నాడు జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. 81.6 శాతం ప్రజాభిప్రాయాలతో పల్నాడు అగ్రస్థానంలో ఉండగా, 81.5 శాతంతో పోలవరం, 80.7 శాతంతో నెల్లూరు, 78.3 శాతంతో తిరుపతి, 77.5 శాతంతో కృష్ణా జిల్లాలు వరుసగా 2 నుంచి 5 స్థానాల్లో నిలిచాయి. గత జూలై నుంచి నవంబరు 7 వరకు ఐవీఆర్ఎస్ ద్వారా రోగుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా వైద్యారోగ్య శాఖ జిల్లాల పనితీరును అంచనా వేసింది. వైద్యుల అందుబాటు, మందులు, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలపై రోగులు వెల్లడించిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంది. మరోవైపు అక్టోబర్ నెలలో ఐవీఆర్ఎస్ ద్వారా పొందిన సమాచారం మేరకు రోగులకుసేవలు అందించడంలో వెనుకబడిన పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన రాష్ట్రవ్యాప్తంగా 135 మంది వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ ఆర్. వెంకటరమణ నివేదించారు. ఐవీఆర్ఎస్ ద్వారా రోగుల అభిప్రాయాలు, ఆసుపత్రుల పనితీరుపై మంత్రి ప్రత్యేకదృష్టి సారిస్తున్నారు. దీనికి అనుగుణంగా ఉన్న తాధికారులు సమీక్షా సమావేశాల్లో ఐవీఆర్ఎస్ నివేదికల ఆధారంగా జిల్లా అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

అట్టడుగున కర్నూలు, అనంతపురం, ఎన్టీఆర్ జిల్లాలు

గడచిన ఐదు నెలల పనితీరు ఆధారంగా వెనుకబడిన జిల్లాల్లో కర్నూలు 69.5 శాతం, అనంతపురం 69.8శాతం, ఎన్టీఆర్ జిల్లా 70.9శాతం, అనకాపల్లి 71.5 శాతం, మార్కాపురం 71.8శాతంతో ఉన్నాయి.

135 మంది వైద్యులకు నోటీసులు

అక్టోబరు నెలకు సంబంధించి వైద్యుల అందుబాటు, పారిశుద్ధ్యం, వైద్య సేవలకు డబ్బులు అడిగారా?, మందులు ఇచ్చారా? అనే నాలుగు అంశాలపై ఐవీఆర్ఎస్ ద్వారా రోగుల అభిప్రాయాలను సేకరించారు. ఈ నాలుగు అంశాలకు సంబంధించి ఒక్కో అంశంలో 100 శాతం ప్రతికూల సమాధానం వచ్చిన రాష్ట్రంలో 135 మంది వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డాక్టర్ ఆర్.వెంకటరమణ తెలిపారు.

ఉత్తమ పనితీరు కనబరిచిన తొలి 20 ఆరోగ్య కేంద్రాలు

గత నెలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరులో ఉత్తమ స్థానాలు సాధించిన వాటిలో అనంతపురం జిల్లా కూడేరు పీహెచ్‌సీ, తరిమెల పీహెచ్‌సీ, శ్రీరంగాపురం, కంబదూరు, గార్లదిన్నె ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో మాచవరం పీహెచ్‌సీ, కానూరు పీహెచ్‌సీ, ఏలూరు జిల్లాలో పి.ఎన్.కొలను, పి.ఆర్.గూడెం, కర్నూలు జిల్లాలో హర్దగేరి, పల్నాడు జిల్లాలో సిరిగిరిపాడు, ప్రకాశం జిల్లాలో కురిచేడు, నెల్లూరు జిల్లాలో జగదేవిపేట, చేజర్ల, శ్రీ సత్యసాయి జిల్లాలో సోమందిపల్లి, శ్రీకాకుళం జిల్లాలో కింతలి, తిరుపతి జిల్లాలో పాతకోట, లాసాగరం యూపీహెచ్‌సీలు, పాకాల పీహెచ్‌సీ, వైఎస్సార్ కడప జిల్లాలో తొండూరు పీహెచ్‌సీలు తొలి 20 స్థానాల్లో నిలిచాయి.

వెనుకబడిన ఆరోగ్య కేంద్రాలు

పనితీరులో వెనుకబడిన ఆరోగ్య కేంద్రాల్లో అనంతపురం జిల్లా గరుడచేడు, జంగాల కాలనీ యూపీహెచ్‌సీ, నంద్యాల జిల్లా బెయిర్లురుటి, వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు పీహెచ్‌సీ, శ్రీ సత్యసాయి జిల్లా వెంకలమ్మ చెరువు పీహెచ్‌సీలు ఉన్నాయి.

సీపీఎస్ ఉద్యోగులకు శుభవార్త

- **ఓపీఎస్‌లోకి మారేందుకు వన్-టైమ్ ఆప్షన్**
- **నిధి పోర్టల్‌లో దరఖాస్తుల స్వీకరణ. డిసెంబర్ 31 వరకు గడువు**
- **2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు విడుదలైన నోటిఫికేషన్ ద్వారా ఎంపికై తరువాత విధుల్లో చేరిన ఉద్యోగులు అర్హులు**

అమరావతి (చైతన్యరథం): సీపీఎస్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. అర్హులైన ఉద్యోగులు పాత పింఛను విధానంలోకి మారేందుకు అవకాశం కల్పిస్తూ ఈ మేరకు జీవో ఎంఎస్ నంబర్ 158 విడుదల చేసింది. 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందే వెలువడిన రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌ద్వారా ఎంపికైన వారికి మాత్రమే ఇది వర్తిస్తుంది.

ఆ తేదీ తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగులకు ఓపీఎస్‌ను ఎంచుకునేందుకు ప్రభుత్వం వన్-టైమ్ ఆప్షన్ కల్పించింది. ఓపీఎస్‌కు మారేందుకు ఆప్షన్ నమోదు చేసుకోవడానికి 2026 డిసెంబర్ 31వ తేదీని ఆఖరి గడువుగా విధించింది. దరఖాస్తుల స్వీకరణ, ఆప్షన్ల పరిశీలన ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో 'నిధి' పోర్టల్ ద్వారా మాత్రమే నిర్వహిస్తారు.

కేంద్ర ప్రభుత్వ నేషనల్ పెన్షన్ సిస్టమ్ మార్గదర్శకాలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, కాలపరిమితితో పూర్తి చేసేందుకు సమగ్ర మార్గదర్శకాలు విడుదల చేసింది. దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, పెన్షన్ బెనిఫిట్స్ ఖరారు చేయాలని నియామక అధికారులను ఆర్థికశాఖ ఆదేశించింది.

ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉద్యోగులతో పాటు పదవీ విరమణ పొందిన వారు, మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు (ఫ్యామిలీ పెన్షనర్లు) కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. దరఖాస్తుదారులు తమ తొలి నియామక అధికారి నుంచి రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్, సెలెక్షన్ లిస్ట్, అపాయింట్‌మెంట్ ఆర్డర్, విధుల్లో చేరినట్లు తెలిపే ధ్రువీకరించిన కాపీలు విధిగా పొందాలి. తొలి నియామక అధికారి 15 పని దినాల్లోగా ఉద్యోగులకు సంబంధిత ధ్రువపత్రాల సర్టిఫికెట్ కాపీలను అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఓపీఎస్ ఆప్షన్ ఆమోదం పొందిన వెంటనే సదరు ఉద్యోగులను జీపీఎఫ్ లేదా ఇతర ప్రావిడెంట్ ఫండ్ పరిధిలోకి మారుస్తూ నిబంధనలు రూపొందించనుంది.

దశాబ్దాలుగా సీపీఎస్ రద్దు కోరుతూ పోరాడుతున్న ఉద్యోగ వర్గాల్లో, కనీసం నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ఈ వర్గానికైనా న్యాయం జరిగేలా ఉత్తర్వులు వెలువడటం సచివాలయ, ఉద్యోగ వర్గాల్లో పెద్ద ఊరటను నింపింది. 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు నోటిఫికేషన్ ద్వారా ఎంపికై సాంకేతిక కారణాలతో ఆలస్యంగా విధుల్లో చేరిన వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ నిర్ణయంతో లబ్ధి పొందనున్నారు. సర్వీసులో చేరిన నాటి నుంచి సీపీఎస్ కోరల్లో చిక్కుకుని రిటైర్మెంట్ భద్రతపై ఆందోళన చెందుతున్న వీరంతా గతంలో కోర్టులను ఆశ్రయించడమే కాకుండా, వినతిపత్రాలతో ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలు నీటిమూటలుగా మిగిలిపోయిన తరుణంలో.. ప్రస్తుత ప్రభుత్వం జీవో 158 రూపంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వడం ద్వారా వీరి సర్వీస్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లయింది.

'మురసు' ప్రభావం.. 1,302 కి.మీ.

రహదారులు ధ్వంసం

- **తాత్కాలిక పునరుద్ధరణకు రూ.98.70 కోట్లు..**
- **శాశ్వత పునరుద్ధరణకు రూ.772.22 కోట్లు అవసరమని అంచనా**
- **మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెల్లడి**



అమరావతి (చైతన్యరథం): మురసు తీవ్ర తుఫాన్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బీ శాఖ పరిధిలోని 1,302 కి.మీ. మేర రహదారులు దెబ్బతిన్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. అత్యధికంగా బాపట్ల జిల్లాలో 332 కి.మీ., గుంటూరులో 266 కి.మీ., ఎన్టీఆర్ జిల్లాలో 202 కి.మీ., పశ్చిమగోదావరిలో 122 కి.మీ., పల్నాడులో 93 కి.మీ., ఏలూరులో 75 కి.మీ., తూర్పుగోదావరిలో 68 కి.మీ., నెల్లూరులో 66 కి.మీ., కృష్ణాలో 59 కి.మీ., ప్రకాశం జిల్లాలో 17 కి.మీ. మేర రహదారులు దెబ్బతిన్నాయని వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా 158 చోట్ల రహదారులు కోతకు గురికాగా, 141 చోట్ల పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. 31 చోట్ల రహదారులు కొట్టుకుపోగా, 30 చోట్ల పునరుద్ధరించామని, 60 చోట్ల సీడీ వర్క్స్ దెబ్బతినగా 58 చోట్ల పునరుద్ధరణ పనులు చేపట్టామని పేర్కొన్నారు. 207 చోట్ల పడిపోయిన చెట్లను పూర్తిగా తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశామని, భారీ వర్షాల కారణంగా 120 చోట్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా 116 చోట్ల సమస్యను పరిష్కరించామని వివరించారు. అధిక వరద ప్రవాహం కారణంగా తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని నాలుగు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు.

తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రహదారుల తాత్కాలిక పునరుద్ధరణకు రూ.98.70 కోట్లు, శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరణకు రూ.772.22 కోట్లు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేసినట్లు మంత్రి తెలిపారు. మొత్తంగా ఆర్ అండ్ బీ శాఖ పరిధిలోని రహదారుల పునరుద్ధరణకు రూ.870.90 కోట్లు వ్యయం అవుతుందని వెల్లడించారు.

నిమ్మాడలో నిండైన దీపావళి వెలుగులు

●కుటుంబ సమేతంగా పండుగ సంబరాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు!



కోటబొమ్మాళి (చైతన్యరథం): చెడుపై మంచి సాధించిన విజయానికి, అజ్ఞానమనే చీకటిపై జ్ఞానమనే వెలుగుల గెలుపునకు ప్రతీకగా నిలిచే దీపావళి పర్వదినాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మంత్రి సతీమణి కింజరాపు విజయమాధవి, కుమారుడు కింజరాపు కృష్ణమోహన్ నాయుడుతో కలిసి తన స్వగ్రామమైన నిమ్మాడలో కుటుంబసభ్యులతో కలిసి అత్యంత ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. తన నివాసం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి దీపాలు వెలిగించి పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దీపావళి పండుగ ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నింపుతుందని, కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయతను, అనుబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఈ పర్వదినం చాటిచెబుతుంది. చీకటిని పారద్రోలి వెలుగులను ఆహ్వానించే ఈ పండుగ ప్రజల జీవితాల్లో కొత్త ఆశలకు, సరికొత్త ఆశయాలకు నాంది పలుకుతుంది. స్వగ్రామమైన నిమ్మాడలో కుటుంబ సభ్యుల సమక్షంలో మంత్రి అచ్చెన్నాయుడు దీపావళి వేడుకల్లో పాల్గొనడంతో ఆయన నివాసం పండుగ శోభను సంతరించుకుంది. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలు కుటుంబ సభ్యుల్లో ఆనందోత్సాహాలను నింపాయి.

మహిళా క్రికెట్‌లో కొత్త ప్రతిభకు ప్రోత్సాహం!

● విజి స్టేడియం అభివృద్ధికి కార్యాచరణ : ఎంపీ కలిశెట్టి



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం జిల్లా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఈరోజు విజ్జి స్టేడియంలో జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ కేవీఎల్ఎన్ రాజు, సెక్రటరీ పెనుమత్స సీతారామరాజు, ఇతర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజ్జి స్టేడియంలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించడంతో పాటు, భవిష్యత్తులో క్రీడాకారులకు మరింత మెరుగైన శిక్షణ, సాధన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా మహిళా క్రికెట్‌కు ప్రోత్సాహం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల జోనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన మహిళా క్రీడాకారిణులకు స్పోర్ట్స్ దుస్తులను స్పాన్సర్ చేయాలని నిర్ణయించారు. అంతేకాకుండా, రాబోయే రోజుల్లో మహిళల కోసం ప్రత్యేక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి, గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న మహిళా క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు సమావేశంలో తీర్మానించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది ప్రతిభావంతులైన బాలికలు, మహిళా క్రీడాకారిణులు సరైన అవకాశాలు, ప్రోత్సాహం లేక తమ ప్రతిభను నిరూపించుకోలేకపోతున్నారు. అలాంటి వారిని గుర్తించి, తగిన శిక్షణ, ప్రోత్సాహం, వేదిక కల్పించడం ద్వారా మట్టిలో మాణిక్యాలుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యం. మహిళా క్రీడాకారిణులకు సమాన అవకాశాలు కల్పిస్తూ, జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు రాణించే క్రీడాకారిణులను తయారు చేయడమే లక్ష్యంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ద్వారా నిరంతర కృషి చేస్తామని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్పష్టం చేశారు.

ఏడు ద్విచక్ర వాహనాలకు నిప్పంటించిన దుండగులు



అల్లూరి జిల్లా (చైతన్యరథం): అల్లూరి జిల్లా జి.మాడుగుల మండల కేంద్రంలో గాంధీనగరం కాలనీలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంటి సమీపంలో నిలిపి ఉంచిన ఏడు ద్విచక్ర వాహనాలకు నిప్పంటించారు. మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలను అదుపు చేశారు. అప్పటికే 5 ద్విచక్ర వాహనాలు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. రెండు ద్విచక్ర వాహనాలు స్వల్పంగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్పెయిన్ గడ్డపై మెరిసిన తెలుగు తేజం...

ఓపెన్ చెస్ టోర్నమెంట్ టైటిల్‌ను కైవసం చేసుకున్న గ్రాండ్ మాస్టర్ లలిత్ బాబు



స్పెయిన్ గడ్డపై తెలుగు తేజం మెరిసింది.. 64 గళ్ల చదరంగ బోర్డుపై పదునైన ఎత్తులు వేస్తూ.. అంతర్జాతీయ హేమాహేమీలను చిత్తు చేసి ప్రతిష్ఠాత్మక బెనిడోర్మ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు గ్రాండ్‌మాస్టర్ లలిత్ బాబు. ఈ విజయం కేవలం ఆరంభం మాత్రమేనని, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్ స్థానాలకు చేరడమే తన అసలు లక్ష్యమని స్పష్టం చేశారు. చదరంగం అంటే కేవలం 64 గళ్ల ఆట కాదు.. ప్రత్యర్థి ఎత్తును ముందే పసిగట్టే వ్యూహం.. ప్రతి అడుగులోనూ అప్రమత్తత.. గెలుపు కోసం చివరి వరకు పోరాడే పట్టుదల. అలాంటి చదరంగంలో తనదైన ఎత్తులతో అంతర్జాతీయ వేదికపై తెలుగు జెండాను రెపరెపలాడించారు గ్రాండ్ మాస్టర్ ముసునూరి లలిత్ బాబు. స్పెయిన్ వేదికగా జరిగిన ప్రతిష్ఠాత్మక బెనిడోర్మ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. ప్రపంచ స్థాయి ఆటగాళ్లతో తలపడి టైటిల్‌ను సొంతం చేసుకున్న ఆయన.. స్వదేశానికి తిరిగి వచ్చి తన విజయానందాన్ని పంచుకున్నారు. స్పెయిన్‌లో జరిగిన ఈ టోర్నమెంట్‌లో ప్రపంచంలోని పలువురు ప్రతిభావంతమైన ఆటగాళ్లు పోటీపడ్డారు. ప్రతి మ్యాచ్‌లోనూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ, తన ఆటతీరుతో ఆకట్టుకున్న లలిత్ బాబు చివరకు విజేతగా నిలిచారు. ఈ టోర్నమెంట్‌లో గోల్డ్ మెడల్ సాధించడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. ఈ విజయం తనకు మరింత ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని తెలిపారు. బెనిడోర్మ్ విజయం ఒక మైలురాయి మాత్రమే.. తన అసలు లక్ష్యం ఇంకా ముందుందని లలిత్ బాబు చెబుతున్నారు. ముఖ్యంగా విదేశీ టోర్నమెంట్లలో పాల్గొనడం, నిరంతర సాధన కొనసాగించడం కోసం ప్రభుత్వ సహకారం కీలకమని లలిత్ బాబు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం నుంచి సరైన సహకారం, ప్రోత్సాహం అందితే తన లక్ష్యాలను మరింత త్వరగా చేరుకోగలనని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ ఎన్నికల ఫలితాలు మరింత బాధ్యతను పెంచాయి : ఎమ్మెల్యే కోండ్రు



రాజాం (చైతన్యరథం): ప్రాదేశిక ఎన్నికల్లో ప్రజలు అఖండ విజయాన్ని అందించారని రాజాంఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల ఫలితాలు తమపై మరింత బాధ్యతను పెంచాయని చెప్పారు. ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ఆయన శ్యాంపురం తెదేపా క్యాంప్ కార్యాలయంలో సోమవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలోని 4 మండలాల్లో 66 ఎంపీటీసీ స్థానాలు ఉంటే 62 కూటమికి రాగా.. వాటిలో 60 టీడీపీ గెలిచిందన్నారు. నాలుగు జడ్పీటీసీ స్థానాల్లోనూ తెదేపా అభ్యర్థులు గెలుపొందారని గుర్తు చేశారు. ఈ గెలుపును కేవలం విజయంగా కాకుండా, ప్రజలు అప్పగించిన బాధ్యతగా భావించాలని సూచించారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేయాలని, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వంగర ఎంపీపీ అభ్యర్థి బొత్స వాసుదేవరావు నాయుడు, జడ్పీటీసీ అభ్యర్థి మజ్జి గణపతి, రాజాం ఎంపీపీ అభ్యర్థి గురవాణ నారాయణ రావు, రేగిడి ఎంపీపీ అభ్యర్థి దూబ ధర్మారావు, నంది సూర్య ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల సందడి... గుర్తులు కేటాయించిన ఈసీ



అమరావతి (చైతన్యరథం): గ్రామ పంచాయతీ ఎన్నికలకు ముహూర్తం దగ్గర పడుతుండటంతో రాష్ట్రంలో ఎన్నికల సందడి ఊపందుకుంది. ఈ నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసే స్వతంత్ర అభ్యర్థుల కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్ గుర్తులను ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఓటింగ్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఈసారి సర్పంచ్ అభ్యర్థులకు 25 గుర్తులు, వార్డు సభ్యుల అభ్యర్థులకు 20 ప్రత్యేక గుర్తులను కేటాయించింది. వీటితో పాటు ఓటర్లకు నోటా (NOTA) ఆప్షన్ కూడా బ్యాలెట్ కాగితాల్లో అందుబాటులో ఉండనుంది. ఒకవేళ ఏదేని స్థానంలో అభ్యర్థుల సంఖ్య కేటాయించిన గుర్తుల కంటే ఎక్కువ ఉంటే, అదనపు గుర్తులను కూడా అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను మొత్తం మూడు విడతల్లో నిర్వహించేందుకు అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ నెల 26, 29 తేదీలతో పాటు డిసెంబర్ 2వ తేదీన పోలింగ్ జరగనుంది. సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థుల కోసం మంచం, కత్తెర, ఉంగరం, బుట్ట, వంకాయ, కప్పు–సాసరు, క్యారెట్, తాళం చెవి, గొలుసు, కుర్చీ, బ్యాట్, టెలిఫోన్, బల్ల, మొక్కజొన్న, పలక, ద్రాక్షపళ్లు, తిరగలి, కుండ, అరటిపండు, కొవ్వొత్తులు, నల్లబోర్డు, అనాసపండు, షటిల్, చేతికర్ర మరియు చెంచా వంటి గుర్తులను సిద్ధం చేశారు.

మరోవైపు వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులకు నిత్య జీవితంలో వాడే వస్తువుల ఆధారంగా గుర్తులను కేటాయించారు. ప్రెషర్ కుక్కర్, గౌను, స్టూల్, ఇస్త్రీ పెట్టె, పోస్ట్ డబ్బా, గ్యాస్ స్టౌ, బీరువా, ఐస్క్రీమ్, కెటిల్, కటింగ్ ప్లేయర్, విద్యుత్ స్తంభం, గరాటా, డిష్ యాంటెన్నా, రంపం, కెమెరా, క్యారమ్ బోర్డు, వయోలిన్, బెండకాయ, బెల్టు, కోటు గుర్తులను వార్డు సభ్యుల బ్యాలెట్లలో పొందుపరచనున్నారు. గుర్తులు ఖరారు కావడంతో పల్లెల్లో ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల కేటాయింపులపై స్థానికంగా చర్చలు హోరెత్తుతున్నాయి.

రాజాంలో అగ్నిప్రమాదం... రూ.25 లక్షల వరకు ఆస్తి నష్టం



రాజాం (చైతన్యరథం): విజయనగరం జిల్లా రాజాం పట్టణం పాలకొండ రోడ్డులోని నవదుర్గా ఆటోమొబైల్స్ అండ్ లూబ్రికేషన్ దుకాణంలో ఆదివారం రాత్రి దాటిన తర్వాత అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుకాణంలో ట్రాక్టర్ విడిభాగాలు, లూబ్రికేటింగ్ ఆయిల్స్, గ్రీజు, బెల్టులు నిల్వ ఉండటంతో వాటికి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.25 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారి అశోక్ అంచనా వేశారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం, గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీపావళి సందర్భంగా వీధిలో బాణసంచా పేల్చడంతో నిప్పురవ్వలు దుకాణంపై పడటంతోనే ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఈ సమయంలో పాలకొండ రహదారితోపాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

పట్టణ ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ ఎత్తివేత.. గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగింపు

విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ ఎత్తివేసినట్లు ప్రకటించారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికల నిర్వహణ ప్రక్రియ మొత్తం పూర్తి కావడంతో ఈ ప్రకటన చేశారు. ఇటు ఎంపీటీసీలు, జిల్లా పరిషత్ ఎన్నికల ప్రక్రియ కూడా ముగిసింది. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఎన్నికల కోడ్ కొనసాగుతుంది. పంచాయతీ ఎన్నికలు ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లో కోడ్ కొనసాగిస్తారు. రాష్ట్రంలో ఈనెల 7వతేది రాత్రి 10 గంటల నుంచి గ్రామీణ ప్రాంతాలు మినహా రాష్ట్రమంతా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును ఎత్తివేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగియడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్ఈసీ తెలిపింది. వాస్తవానికి కోడ్ ఇంకా ముందే ఎత్తివేయాల్సింది కానీ.. మురసు తుఫాన్ కారణంగా బాపట్ల జిల్లా చీరాల మున్సిపాలిటీ ఓట్ల లెక్కింపు వాయిదాపడింది.. ఈ నెల 6వ తేదీ ఈ కౌంటింగ్ పూర్తి చేయగా.. ఈ నెల 7 రాత్రి నుంచి కోడ్ ఎత్తివేసినట్లు ప్రకటించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ఇంకా పూర్తి కానందున, ఏపీవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ యథాతథంగా కొనసాగుతుందని ప్రకటించింది.

మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తుది ఫలితాలపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. మొత్తం 582 జెడ్పీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహిస్తే టీడీపీకి 406, జనసేన పార్టీకి 73, వైసీపీకి 76, బీజేపీకి 20, స్వతంత్రులు 6, సీపీఐ(ఎం) ఒక స్థానంలో విజయం సాధించాయి. అలాగే 7,768 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించగా.. టీడీపీ 4,806, జనసేన పార్టీ 938, వైసీపీ 1,711, బీజేపీ 117, స్వతంత్రులు 169, కాంగ్రెస్ 9, సీపీఐ(ఎం) 15, బీఎస్పీ 3 స్థానాల్లో గెలుపొందాయి. నెల్లూరు జిల్లాలో 30 జెడ్పీటీసీ స్థానాలకు కూటమి 26 స్థానాల్లో గెలిచింది. శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల్లో 22 స్థానాలు.. శ్రీ సత్యసాయి, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో 21 స్థానాలు గెలిచింది.

కోనసీమ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజల పట్టం

●రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు



కాకినాడ (చైతన్యరథం): కోనసీమ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు ఘన విజయాన్ని అందించారని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పేర్కొన్నారు. కూటమిపై ప్రజలు తమకున్న నమ్మకాన్ని మరోసారి ఎన్నికల ఫలితాల ద్వారా చాటిచెప్పారని తెలిపారు. కోనసీమలో జడ్పీటీసీ ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించామని, మొత్తం 19కి 19 జడ్పీటీసీ స్థానాలను కూటమి కైవసం చేసుకుందని వెల్లడించారు. అదేవిధంగా 379 వీూజ స్థానాలకు గాను 312 స్థానాల్లో విజయం సాధించడం కూటమిపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రశాంతమైన కోనసీమలో గత వైసీపీ పాలనలో కులాల మధ్య చిచ్చుపెట్టి, అల్లర్లకు కారణమయ్యారని విమర్శించారు. అలాంటి పాలనకు ప్రజలు ఎన్నికల ఫలితాల ద్వారా తగిన సమాధానం చెప్పారని, వైసీపీని బంగాళాఖాతంలో కలిపేశారని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వ పాలనలో కోనసీమ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్న ఎంపీ, ప్రజల మద్దతుతో 2029 ఎన్నికల్లోనూ కూటమి ఘన విజయం సాధిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

మానసిక దివ్యాంగుల మధ్య కుటుంబ సమేతంగా దీపావళి సంబరాల్లో పాల్గొన్న మంత్రి నిమ్మల



పాలకొల్లు (చైతన్యరథం): మానసిక దివ్యాంగుల ముఖాల్లో చిరునవ్వులు నింపుతూ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కుటుంబ సమేతంగా దీపావళి వేడుకలు జరుపుకున్నారు. పాలకొల్లులోని అంజలి మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల, ఆయన కుటుంబ సభ్యులు విద్యార్థులకు నూతన వస్త్రాలు, దీపావళి బాణాసంచా సామాగ్రి, స్వీట్లు, పండ్లు అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి బాణాసంచా కాల్చి వారిలో ఆనందోత్సాహాలు నింపారు. కుటుంబానికి దూరంగా వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులతో ఆప్యాయంగా గడుపుతూ వారిని సంతోషపరిచారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. అభం శుభం తెలియని చిన్నారులైన మానసిక దివ్యాంగ విద్యార్థులతో కలిసి దీపావళి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్న వీరితో కలిసి పండుగ జరుపుకోవడం ద్వారా తమ కుటుంబ సభ్యులతోనే దీపావళి జరుపుకున్నామనే ఆత్మీయ భావన వారిలో కలుగుతుందన్నారు. దైవ స్వరూపులైన మానసిక దివ్యాంగులను ఆదరించడం, అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు మానవతా దృక్పథంతో ముందుకొచ్చి ఇలాంటి విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి నిమ్మల కుటుంబ సభ్యులు గోమాతకు దానా వేసి పూజలు నిర్వహించారు. ఆప్యాయత, అనురాగాల మధ్య అంజలి పాఠశాలలో దీపావళి వేడుకలు ఆనందంగా సాగాయి.

జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు గన్ని అభినందనలు



భీమడోలు (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఉంగుటూరు మండలం నుంచి టీడీపీ తరుపున ఎన్నికైన జడ్పీటీసీ, ఎంపీటీసీ, సభ్యులను ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అభినందించారు. భీమడోలులోని తన క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన జడ్పీటీసీ సభ్యుడు చింతల వాసు, నారాయణపురం ఎంపీటీసీ-1 (ఎంపీపీ అభ్యర్థి) అక్కిన నాగమణి, ఎంపీటీసీ సభ్యులు చదలవాడ శశికళ (నారాయణపురం-2), సిరిబత్తిన కళ్యాణ చక్రవర్తి (కైకరం-2), ఘంటసాల సరస్వతి (కైకరం-3) పాలడుగుల కల్పన (గొల్లగూడెం), ఆచంట సత్యనారాయణ (గోపాలపురం), పొరిపిరెడ్డి దేవి (బాదంపూడి), తాడిగడప రమేష్ (నీలాద్రిపురం), ఆకుల శ్రీను (అక్కు పల్లిగోకవరం) లను ఆయన సత్కరించారు. పల్లెల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. మండల అధ్యక్షుడు వేములపల్లి సుధీర్, నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ పోటీలో ఉన్నా ప్రజలు తిరస్కరించారు : ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి అఖండ విజయాన్ని అందించిన ప్రజలకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంపై రాష్ట్ర ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని, ఈ ఎన్నికల ఫలితాలు మరోసారి ఆ విషయాన్ని స్పష్టం చేశాయని పేర్కొన్నారు. విజయవాడలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కూటమి పార్టీల మధ్య ఉన్న సమన్వయం, నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి కారణంగానే ఈ ఘన విజయం సాధ్యమైందని తెలిపారు. విజయవాడ నగరంతో పాటు ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా నిర్వహించామని, ఎక్కడా ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియ ముగిసిందని స్పష్టం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఎన్డీఏ కూటమికి బ్రహ్మరథం పట్టారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వానికి మరోసారి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోటీ చేసినప్పటికీ కూటమి విజయాన్ని అడ్డుకోలేకపోయిందని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు లభించిన గుర్తింపే ఈ విజయమని అభివర్ణించారు.కొన్ని స్థానాల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి ఎదురైనా ప్రజల తీర్పును హుందాగా స్వీకరించామని ఎంపీ తెలిపారు. ఒక ఎంపీటీసీ స్థానంలో కేవలం నాలుగు ఓట్ల తేడాతో, మరో స్థానంలో ఎనిమిది ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి చెందామని వివరించారు. గెలుపోటములు ప్రజాస్వామ్యంలో సహజమని, ప్రజల తీర్పును గౌరవించడం తమ బాధ్యతని పేర్కొన్నారు.ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీ కేశినేని చిన్ని సూచించారు.

మరో 20 ఏళ్లు అధికారం మాదే

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు చూస్తుంటే రాబోయే మరో 20 ఏళ్ల పాటు ఎన్డీఏ కూటమిదే అధికారం అన్న నమ్మకం కలుగుతోందని ఎంపీ చిన్ని ధీమా వ్యక్తం చేశారు.

విజయవాడ డిప్యూటీ మేయర్ పదవిపై స్పష్టత

విజయవాడ నగర డిప్యూటీ మేయర్ పదవికి సంబంధించి మీడియా అడిగిన ప్రశ్నలకు ఎంపీ కేశినేని చిన్ని స్పందిస్తూ.. విజయవాడ మేయర్ పదవిని జనసేన పార్టీకి కేటాయించామని, డిప్యూటీ మేయర్ పదవి తెలుగుదేశం పార్టీకి దక్కుతుందని స్పష్టం చేశారు. ఈ అంశంపై కూటమి నాయకత్వం సమావేశమై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఎంపీ తెలిపారు.

దీపావళి వేళ క్షుద్రపూజల కలకలం...

రాజమహేంద్రవరం (చైతన్యరథం): దీపావళి అమావాస్య వేళ తూర్పుగోదావరి జిల్లాలో ఓ అనుమానాస్పద ఘటన కలకలం రేపింది. నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలో ఆలయం సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పద రీతిలో పూజలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. ఈ ఘటనతో గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది. గ్రామ శివారులోని వైస్ కళాశాల పక్కన ఉన్న ఆలయం వద్ద ఓ వ్యక్తి గొయ్యి తవ్వి, దుస్తులు లేకుండా పూజలు చేస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. దీంతో అనుమానం వచ్చిన గ్రామస్తులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. పూజలు చేస్తున్న వ్యక్తిని గ్రామస్తులు పట్టుకుని నిలదీశారు. ఘటనాస్థలంలో పసుపు, కుంకుమ, అన్నం ముద్దలు కనిపించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అమావాస్య రోజున ఆలయం వద్ద ఈ తరహా ఘటన చోటుచేసుకోవడంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఆ వ్యక్తి ఎవరు? అక్కడ పూజలు ఎందుకు నిర్వహిస్తున్నాడు? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బెజవాడ దుర్గమ్మ సేవలో ఏపీ ఎన్నికల కమిషనర్



విజయవాడ (చైతన్యరథం): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సోమవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ ఏఈవో రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

నల్లజర్ల మండలంలో పొగాకు బ్యారెన్ దగ్ధం... రూ. 10 లక్షల ఆస్తి నష్టం

నల్లజర్ల (చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరం గ్రామంలో పొగాకు బ్యారెన్ దగ్ధమైంది. ఈ ఘటనలో పోతవరం గ్రామానికి చెందిన గద్దె తాతారావుకు చెందిన పొగాకు బేళ్లు కాలిపోయాయి. మురసు తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు తాతారావు పొగాకు బేళ్లు తడిసి ముద్దయ్యాయి. తడిసిపోయిన పొగాకులో ఉన్న చెమ్మను తొలగించేందుకు మళ్లీ బ్యారెన్‌లో పెట్టి క్యూరింగ్ చేస్తుండగా భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల విలువైన పొగాకు బేళ్లు కాలిపోయాయి. సమాచారం అందగానే తాడేపల్లిగూడెం అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

గుంటూరు తూర్పులో కూటమి విజయోత్సాహం

●నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ల ఆత్మీయ సమ్మేళనం!



గుంటూరు (చైతన్యరథం): పొన్నూరు రోడ్డులోని బికన్వెన్షన్ వేదికగా, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో, నగరపాలక సంస్థ ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి కార్పొరేటర్ల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గుంటూరు నగర మేయర్ లక్ష్మీ అపర్ణ కోవెలమూడి పాల్గొని, ప్రజల విశ్వాసాన్ని చూరగొని విజయం సాధించిన కార్పొరేటర్లందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో సభ ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. మేయర్‌గా తన విజయంతో పాటు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కూటమి కార్పొరేటర్ల విజయానికి కీలక భూమిక పోషించిన నజీర్ అహ్మద్‌కి అపర్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల సమయంలో ఆయన అందించిన నాయకత్వం, సమన్వయం, సహాయ సహకారాలను ఈ సందర్భంగా అభినందించారు. ప్రజలు అందించిన ఈ అపూర్వ విజయాన్ని గౌరవంగా భావిస్తూ, రాబోయే రోజుల్లో ప్రతి డివిజన్ అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా కూటమి నాయకులందరూ సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ విజేతలతో ఎమ్మెల్యే రాము భేటీ

● ప్రజా వేదికలో కూటమి విజేతల ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆత్మీయ సమావేశం



గుడివాడ (చైతన్యరథం): గుడివాడ నియోజకవర్గంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజా ప్రతినిధులతో గుడివాడ ప్రజా వేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోమవారం భేటీ అయ్యారు. గుడివాడ రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాలకు చెందిన జడ్పీటీసీలు అంగడాల భారతి, దుడ్ల ప్రదీప్ కుమార్, వర్రె బలరామకృష్ణ, ఎంపీటీసీలు, కూటమి నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. విజేతలను ఎమ్మెల్యే రాము ఆలింగనం చేసుకుని అభినందించారు. మహిళా ప్రజా ప్రతినిధులకు నమస్కరిస్తూ అభివాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ 3 జడ్పీటీసీలకు మూడు, 32 ఎంపీటీసీలకు 28 స్థానాల్లో ఘన విజయం సాధించామన్నారు. నందివాడలో 44 ఏళ్ల టీడీపీ చరిత్రలో తొలిసారి జడ్పీటీసీ, ఎంపీపీ గెలవడం చారిత్రాత్మకమని చెప్పారు. గుడ్లవల్లేరులో 2024 కంటే ఎక్కువ శాతంతో గెలిచామని, చాలా గ్రామాల్లో 69-71% ఓట్లు కూటమికే వచ్చాయని తెలిపారు. ప్రజల కోసం పని చేస్తున్నామని, అందుకే ప్రజలు మాకు అండగా నిలిచారని అన్నారు. ఈ విజయాన్ని కూటమి ప్రభుత్వానికి బహుమతిగా ఇస్తున్నామని పేర్కొన్నారు. పని చేస్తేనే ప్రజలు మెప్పుతారని నమ్ముతానని, అదే ఈ ఫలితాల్లో రుజువైందని స్పష్టం చేశారు. ఓడిన నాలుగు స్థానాల బాధ్యత తానే తీసుకుంటున్నానని అన్నారు. జిల్లాలోనే ఉత్తమ ఫలితాలు గుడివాడలో వచ్చాయని, దీంతో మున్సిపల్ ఫలితాలు ముందే తెలిసిపోయాయని చెప్పారు. రానున్న గుడివాడ మున్సిపల్ ఎన్నికల్లో దీనికి మించిన మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కూటమి శ్రేణులకు ధన్యవాదాలు

నాయకుడంటే ముందుండి నడిపించాలని, పారిపోకూడదని ఎద్దేవా చేశారు. నమ్ముకున్న సొంత వారిని సైతం మోసం చేశారని విమర్శించారు. దమ్ము అంటే ప్రజల కోసం పని చేయడమే తప్ప, ఓడిపోతే బూట్లు తుడుస్తా, అని పిచ్చి ఛాలెంజ్‌లు చేయడం కాదని అన్నారు. పదవి అలంకారం కాదు, బాధ్యత అని, నూతనంగా గెలుపొందిన అందరూ బాధ్యతగా పని చేయాలని సూచించారు.

జనసేన ఇన్‌ఛార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ... జనసేన అభ్యర్థులను గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తితో పని చేసి విజయం సాధిస్తామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ... ప్రజలిచ్చిన ఈ తీర్పుతో బాధ్యత మరింత పెరిగిందని, కార్యకర్తల కష్టానికి, ప్రజల నమ్మకానికి అభివృద్ధితో రుణం తీర్చుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు వాసే మురళి, దానేటి సన్యాసిరావు, పోలవరపు వెంకట్రావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, జనసేన నేత సందు పవన్, ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గెలిచిన అభ్యర్థులు బాధ్యతాయుతంగా పనిచేయాలి : ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ



బాపట్ల (చైతన్యరథం): నియోజకవర్గం కర్లపాలెం మండలంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎంపీపీ, జడ్పీటీసీ మరియు ఎంపీటీసీ ప్రజాప్రతినిధులు బాపట్లలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజుని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులను ఎమ్మెల్యే నరేంద్ర వర్మరాజు శాలువాలతో ఘనంగా సన్మానించి, అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మండల సమగ్ర అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నూతన ప్రజాప్రతినిధులు నిరంతరం ప్రజల్లో ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను, పథకాలను రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరవేయడంలో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు.

కూటమి నేతల సమిష్ట కృషితోనే భారీ విజయం : ఎమ్మెల్యే తంగిరాల



నందిగామ (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించారు. దీంతో ఆ పార్టీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీలు చేశారు. స్థానిక బాబు జగ్జీవన్ రామ్ ఫంక్షన్ హాల్లో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికైన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కూటమి నేతలు సమన్వయంతో పనిచేయడం వల్లే భారీ విజయం సొంతం చేసుకున్నామన్నారు. నందిగామ నియోజకవర్గంలో నాలుగింటిలో మూడు జడ్పీటీసీలు, 59లో 49 ఎంపీటీసీ స్థానాలను కూటమి పార్టీలు దక్కించుకున్నాయని వివరించారు. త్వరలో జరగనున్న పంచాయతీ, సొసైటీ ఎన్నికల్లోనూ జయకేతనం ఎగరవేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

మేయర్ లక్ష్మీ అపర్ణకి బూర్ల రామాంజనేయులు ఆత్మీయ శుభాకాంక్షలు!

గుంటూరు (చైతన్యరథం): నగర మేయర్‌గా అఖండ మెజారిటీతో విజయం సాధించిన లక్ష్మీ అపర్ణ కోవెలమూడిని, ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు సోమవారం మేయర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అపర్ణ గారి ఘన విజయంపై సంతోషం వ్యక్తం చేస్తూ, బూర్ల రామాంజనేయులు ఆమెను శాలువాతో సత్కరించి, ఆత్మీయ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికల సమయంలో తనకు వెన్నుదన్నుగా నిలిచి, విజయానికి విలువైన సహాయ సహకారాలు అందించిన బూర్ల రామాంజనేయులకి అపర్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి



వినుకొండ (చైతన్యరథం): పట్టణంలోని చీఫ్ విప్ వారి కార్యాలయంలో దీపావళి పండుగ వేడుకలలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు వేడుకల్లో పాల్గొని బాణసంచా కాల్చి పండుగ సంబరాలను ప్రారంభించారు. కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆయన పండుగ సంతోషాన్ని పంచుకున్నారు. జీవీ మాట్లాడుతూ... చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. వినుకొండ నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ ఆయన దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం, కోడూరులో అగ్నిప్రమాదం.. ఆస్తినష్టం



జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని డాక్యుమెంట్ రైటర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఏసీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో కార్యాలయంలోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. స్థానికులు అందించిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 3 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు.


కోడూరులో గ్యాస్ సిలిండర్ పేలి చెలరేగిన మంటలు

కృష్ణా జిల్లా కోడూరులోని వంతెన కూడలి వద్ద ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గ్యాస్ సిలిండర్ పేలి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

విజయవాడ - గుంటూరు హైవేపై రోడ్డు ప్రమాదం... ఇద్దరు యువకుల మృతి

గుంటూరు (చైతన్యరథం): గుంటూరు జిల్లా పెదకాకాని సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఇద్దరు వ్యక్తులు బైక్పై నంబూరు నుంచి గుంటూరు వైపునకు వెళ్తున్నారు. మార్గంమధ్యలో పెదకాకాని గ్రామంలోని పుల్లాలమ్మ చెరువు వద్ద హైవేపై వీరు ప్రయాణిస్తున్న బైక్ డివైడర్ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్పై ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన డేరంగుల వెంకటేశ్(24), వేముల సురేందర్(25)గా గుర్తించారు.

తిరువూరులో అగ్నిప్రమాదం... రూ.15 లక్షల ఆస్తినష్టం



తిరువూరు (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా తిరువూరు జైభావి సెంటర్ నాగార్జున జూనియర్ కళాశాల సమీపంలోని భాగ్యలక్ష్మి ఫోటో ఫ్రేమ్స్ స్టూడియోలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మంటలు వ్యాపించి దుకాణం దగ్ధమైంది. సుమారు రూ.15 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు చెబుతున్నారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

కూటమి విజేతల సంబరాలు, శుభాకాంక్షలు

రాయచోటి (చైతన్యరథం): గాలివీడు రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, గాలివీడు జడ్పీటీసీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబును టి.సుండుపల్లె జనసేన జడ్పీటీసీ శ్రీ బుక్కే మంగే నాయక్, టి.సుండుపల్లె మండల నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీలు, సీనియర్ టీడీపీ నాయకులు చప్పిడి మహేష్ నాయుడు, చప్పిడి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గాలివీడు జడ్పీటీసీగా ఘన విజయం సాధించిన సుగవాసి ప్రసాద్ బాబుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు నూతనంగా ఎన్నికైన కూటమి ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.సోమవారం సాయంత్రం రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, గాలివీడు జడ్పీటీసీ సభ్యులుగా రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో చారిత్రాత్మక విజయం సాధించిన సుగవాసి ప్రసాద్ బాబును నూతనంగా ఎన్నికైన పెద్దతిప్పసముద్రం జడ్పీటీసీ సభ్యురాలు తలారి శరణ్య, కురబలకోట జడ్పీటీసీ సభ్యులు సురేంద్ర యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ చారిత్రాత్మక విజయంపై నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రజల ఆశలు మరియు ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని, గ్రామాల అభివృద్ధికి మరింత కృషి చేయాలని పరస్పరం ఆకాంక్షలు తెలియజేసుకున్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని సుగవాసి ప్రసాద్ బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.




తూర్పు నాయుడుపాలెంలో సందడే సందడి

విజేతలతో మంత్రి కార్యాలయం కిటకిట



తూర్పు నాయుడుపాలెం(చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయంతో తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులు, కార్యకర్తలు మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిని కలిసేందుకు క్యాంపు కార్యాలయానికి భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ మంత్రి వారికి అభినందనలు తెలిపారు.



అనంతరం మంత్రి మాట్లాడుతూ, మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు కూటమికి తిరుగులేని విజయాన్ని అందించి అభివృద్ధికి పట్టం కట్టారన్నారు. ఇది ప్రజా విజయమని, ప్రజలు సీఎం చంద్రబాబు సారధ్యంలోని కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి మరింత పాటుపడతామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన వారు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఈ సందర్భంగా సూచించారు.

సంక్షేమాభివృద్ధికి పట్టంగట్టిన ప్రజలు

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి



కోవూరు (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా పరిషత్ ఎన్నికల్లో కూటమికి ప్రజలు పట్టం కట్టారని టీడీపీ ఎమ్మెల్యే కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందుగానే రాష్ట్రంలో దీపావళి పండుగ వచ్చిందని అన్నారు. ఐదేళ్ల నిరంకుశ పాలన తర్వాత ఈ రెండున్నరేళ్లలో సీఎం చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టారని చెప్పారు. ఆదివారం నెల్లూరు జిల్లా కోవూరులో ఆమె మాట్లాడుతూ.. ఈవీఎంలతో గెలిచాం అన్నారని.. బ్యాలెట్ పేపర్లతో అన్ని చోట్ల గెలిచామని వివరించారు. ప్రజల్లోకి వెళ్తే కూటమి ప్రభుత్వానికి ప్రజలు జేజేలు కొడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని స్పష్టం చేశారు. కోవూరులో 5 జడ్పీటీసీల్లో 3 ఏకగ్రీవమయ్యామని గుర్తు చేశారు. కోవూరు ప్రజలు తమకు భారీ మెజార్టీతో బ్రహ్మరథం పట్టారని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే స్థానికంగా 78 ఎంపీటీసీలకుగాను 70 స్థానాల్లో తామే సత్తా చాటామని చెప్పారు. కూటమికి పట్టం కట్టిన ప్రజలందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన ప్రతి ఒక్కరు ప్రజల్లో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజయం సాధించిన కూటమి అభ్యర్థులకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచించారు.



విద్యార్థిని ఆరోగ్యం మరింత మెరుగు

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం (చైతన్యరథం): అనంతపురం జిల్లా రాప్తాడులో ఉన్మాది దాడిలో గాయపడిన విద్యార్థిని ఆరోగ్యం మరింత మెరుగుపడిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను చిన్నపిల్లల అత్యవసర చికిత్స విభాగం నుంచి సాధారణ వార్డుకు మార్చారని చెప్పారు. రాజధాని అమరావతిలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈ రోజు విద్యార్థిని గాయాలకు వైద్య బృందం మరోసారి కట్లు మార్చారని పేర్కొన్నారు. ఎడమ చేతికి వేసిన పట్టీని వైద్యులు తొలగించారని అన్నారు. దీంతో ఆమె చేతిని కదిలించేందుకు సౌలభ్యం ఏర్పడిందని మంత్రి సత్యకుమార్ వివరించారు. ఆహారం తక్కువ తీసుకుంటుందని తెలిపారు. దీంతో ముక్కు ద్వారా గొట్టంతో ఆహారం అందిస్తున్నారని చెప్పారు. నోటి ద్వారా ఆహారం తీసుకునేలా ఆమెను వైద్యులు ప్రోత్సహిస్తున్నారని వెల్లడించారు. డాక్టర్ భాస్కర్ షెనాయ్ పర్యవేక్షణలో విద్యార్థినికి చికిత్స అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్లాస్టిక్ సర్జరీ, ఆర్థోపెడిక్ వైద్యుల సమన్వయంతో బాలికకు చికిత్స అందుతోందని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

రూ.2,500 కోట్లకు పైగా పుట్టపర్తిలో అభివృద్ధి పనులు

పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సిందూరరెడ్డి



పుట్టపర్తి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్లలో పుట్టపర్తి నియోజకవర్గంలో రూ.2,500 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సంధూరరెడ్డి వెల్లడించారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలపడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు గ్రామాల్లో పర్యటిస్తూ, వారి ఇబ్బందులను ఓపికగా వింటున్నామని, సాధ్యమైన సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గానికి భారీ పెట్టుబడులు తీసుకురావడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారం కీలకమని పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. ఈ రెండేళ్లలో నియోజకవర్గానికి రూ.1.53 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చేలా ప్రయత్నాలు సాగుతున్నాయని తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాలు పోటీ పడుతున్న నేపథ్యంలో ఐదో తరం యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తి ప్రాంతం వైపు మొగ్గు చూపడం ఈ ప్రాంతానికి గర్వకారణమన్నారు. "పెద్దల ఆశీస్సులతోనే నియోజకవర్గానికి ఇంతటి భారీ ప్రాజెక్టులు వస్తున్నాయని పేర్కొన్నారు. పుట్టపర్తి ప్రాంతంలో సుమారు రూ.1 లక్ష కోట్ల పెట్టుబడితో యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు, ఆమడగూరు మండలంలో రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో భారీ సోలార్ ప్రాజెక్టు ఈ ప్రాంత అభివృద్ధికి గేమ్‌చేంజర్లుగా మారనున్నాయని వివరించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా పుట్టపర్తి ప్రాంతంలో త్వరలో సుమారు 4,000 మందికి ఉపాధి కల్పించే జీన్స్ ఫ్యాక్టరీ ఏర్పాటు కానుందని తెలిపారు. భారీ పరిశ్రమలు, పెట్టుబడులు రావడంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, వ్యాపార రంగం కూడా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అంశంపై టీడీపీ తీసుకున్న నిర్ణయాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్వాగతించారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

జడ్పీటీసీగా పరిటాల శ్రీరామ్ ప్రభంజనం

తెల్లవారుజామున తండ్రి పరిటాల రవి ఘాట్ వద్ద పూజలు పార్టీ శ్రేణులు, కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు







ధర్మవరం (చైతన్యరథం): నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ జడ్పీటీసీ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేశారు. ఎన్నికల ఫలితాల్లో మొదటి రౌండ్ నుంచి శ్రీరామ్ స్పష్టమైన ఆధిక్యత చూపించారు. చివరి రౌండ్ ముగిసే సరికి 4182ఓట్ల మెజార్టీతో ఆయన విజయం సాధించినట్టు అధికారులు ప్రకటించారు. ఫలితాల రోజున అర్ధరాత్రి నల్లచెరువులో డిక్లరేషన్ తీసుకున్నారు. ఆ తర్వాత స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, స్థానిక బిజెపి నాయకుడు పార్థసారథి ఇతర కూటమి నాయకులను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఎన్నికల్లో కూటమి విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అక్కడి నుంచి నేరుగా ఆదివారం తెల్లవారుజామున 3గంటల సమయంలో పరిటాల రవీంద్ర ఘాట్ ను సందర్శించారు. డిక్లరేషన్ ఫారాన్ని ఆయన ఘాట్ దగ్గర ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తమ ఇలవేల్పు ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు ఆయనకు శుభాకాంక్షల వెల్లువ కనిపించింది. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో విజయం సాధించిన జడ్పీటిసి, ఎంపీటీసీ అభ్యర్థులతో పాటు పలు గ్రామ ప్రజలు శ్రీరామ్ ను కలిశారు. గెలిచిన అభ్యర్థులను అభినందిస్తూ మనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలు అందించాలని సూచించారు. నల్లచెరువు నుంచి గెలిచిన శ్రీరామ్ కు అభినందనలు, శుభాకాంక్షల వెల్లువ కనిపించింది. కార్యకర్తలు, అభిమానులు ఆయనకు పూలమాలలు వేసి, గజమాలలతో సత్కరిస్తూ "కాబోయే జడ్పీ చైర్మన్ పరిటాల శ్రీరామ్" అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతపురం, వెంకటాపురంలోని పరిటాల నివాసాలు అభిమానులు, కార్యకర్తల కోలాహలంతో సందడిగా మారాయి. ఈ విజయంతో పరిటాల అభిమానులు, కూటమి శ్రేణుల్లోనూ కొత్త ఉత్సాహం నెలకొంది.

అనంతలో అభివృద్ధి పనులు వేగవంతం

అనంతపురం (చైతన్యరథం): అర్బన్ నియోజకవర్గంలో 2వేలకోట్లకు పైగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఈ రెండేళ్లలో చేశామని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. మౌలిక వసతుల కోసం రూ. 300 కోట్లు ఖర్చు చేశామని... మేము చేసిన అభివృద్ధి వల్లే నేడు రాంనగర్ ప్రాంతంలో సెంట్ భూమి విలువ రూ. 20 లక్షల నుండి రూ. 40 లక్షలకు చేరిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో డంపింగ్ యార్డ్ పేరుతో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని విమర్శలు చేశారు.

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చెత్తను పూర్తి స్థాయిలో తొలగించే ప్రక్రియ ప్రారంభించామన్నారు. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయని.. మిగిలిన 25 శాతం పనులను రాబోయే రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. వచ్చే మూడు నెలల్లో ఇక్కడ సరికొత్త 'ఫ్రెష్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్' తీసుకురాబోతున్నామని.. మిగిలిన స్థలంలో ప్రజల కోసం అందమైన పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. గత నెలలోనే అమృత్-2 ద్వారా రూ. 107 కోట్లతో నియోజకవర్గంలో ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేయబోతున్నామని.. రూ. 50 కోట్లతో నగరంలో పార్కులు, డ్రైన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. వీటితో పాటు అదనంగా మరో రూ. 160 కోట్లతో అత్యాధునిక డ్రైనేజీ వ్యవస్థను నిర్మించబోతున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు రాయలసీమ ప్రాంతాన్ని రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌గా మార్చబోతున్నామని దగ్గుపాటి ప్రసాద్ గారు అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 40వేల కోట్లు, కేంద్ర ప్రభుత్వం మరియు పీపీపీ మోడల్‌లో మరో రూ. 60వేల కోట్లు తీసుకురావడం జరుగుతోందన్నారు. మదనపల్లిలో రిలయన్స్ భాగస్వామ్యంతో ప్రతిష్టాత్మక హార్టీకల్చర్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు ఒక్క డ్రిప్ లేదా స్ప్రింక్లర్ కూడా ఇవ్వలేదని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 300 కోట్లతో డ్రిప్పులు, స్ప్రింకర్లను రైతులకు అందించామన్నారు. రాయలసీమ ప్రాంతానికి గతంలో ఎప్పుడూ లేని విధంగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. చిత్తూరు జిల్లాకు ప్రసిద్ధ రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ ఫ్యాక్టరీని తీసుకొచ్చామన్నారు. అలాగే వేల కోట్ల పెట్టుబడులతో విండ్, సోలార్ పవర్ ప్రాజెక్టులు వస్తున్నాయన్నారు. పుట్టపర్తికి యుద్ధ విమానాలు తయారు చేసే డిఫెన్స్ పరిశ్రమను తీసుకొచ్చామన్నారు. అనంతపురం జిల్లాలో రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించబోతున్నారన్నారు. గతంలో సీఎం చంద్రబాబు కియా మోటార్స్ తెచ్చి 50వేల మందికి ఉద్యోగ,ఉపాధి కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

మండల పరిషత్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ హవా

కర్నూలు (చైతన్యరథం): జిల్లాలో మండల పరిషత్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ హవా కొనసాగింది. ఓర్వకల్లు, కల్లూరు, కర్నూలు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లోని జడ్పీటీసీ స్థానాలను టీడీపీ కైవసం చేసుకుంది. కోడుమూరులో వైసీపీ విజయం సాధించింది. ఓర్వకల్లు మండలంలో ఒకే కుటుంబానికి చెందిన అక్కాచెల్లెళ్లు రాజకీయ ప్రత్యర్థులుగా బరిలో నిలిచిన జడ్పీటీసీ ఎన్నికల పోరు ఉత్కంఠ భరితం గా సాగి.. చివరకు టీడీపీ విజయంతో ముగిసింది. టీడీపీ బలపరిచిన జడ్పీటీసీ అభ్యర్థి చెట్ల దానమ్మ తన సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి చెట్ల ప్రశాంతిపై 3,287 ఓట్ల మెజారిటీతో విజయం సాధించింది. కల్లూరు జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థిగా మాధవి విజయం సాధించారు. వైసీపీకి చెందిన ప్రత్యర్థి వాకిటి లక్ష్మమ్మపై 1895 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కర్నూలు మండల జడ్పీటీసీ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. గార్లేయపురం గ్రామానికి చెందిన జూటూరు శైలజను టీడీపీ తరుపున జడ్పీటీసీ అభ్యర్థిగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చెర్మన్ విష్ణువర్దన్ రెడ్డి కలసి బరిలోకి దింపారు. వైసీపీ నుంచి పి.రుద్రవరం గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ఎంకె మాధవి పోటీ చేశారు. కర్నూలులో శనివారం కౌంటింగ్ జరిగిన ఫలితాల్లో వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థి ఎంకె.మాధవిపై టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి జూటూరు శైలజ 13,199 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. గూడూరు జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థిగా జె. నయోమి 1326 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. సి.బెళగల్ జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థిగా ఎన. జగదీశ్వరరెడ్డి 124 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కోడుమూరు జడ్పీటీసీ స్థానాన్ని వైసీపీ కైవసం చేసుకుంది. జడ్పీటీసీ స్థానంలో వైసీపీ అభ్యర్థిగా కోట్ల భానుశ్రీ టీడీపీ అభ్యర్థి శారదమ్మపై 638 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అనంతరం గెలుపొందిన అభ్యర్థులకు ఎన్నికల అధికారులు డిక్లరేషన్ పత్రాలను అందజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు జగన్‌కు గొడ్డలిపెట్టు

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గుత్తికొండ ధనుంజయరావు



అనంతపురం (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ప్రజల మద్దతును ప్రతిబింబిస్తున్నాయని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. స్థానిక సంస్థలు ప్రజాస్వామ్యానికి పునాదులని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధిలో వాటి పాత్ర అత్యంత కీలకమని ఆయన అన్నారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయడం, ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయడం, అభివృద్ధి ఫలాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

పులివెందులలో ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను అడ్డుకునేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రయత్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ధనుంజయరావు విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, అటువంటి ఓటు హక్కును తానే వినియోగించుకోకుండా ఎన్నికల ప్రక్రియను ప్రశ్నించడం ద్వారా జగన్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని అన్నారు. అయినప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా కూటమి అభ్యర్థికి పట్టం కట్టడం చారిత్రాత్మక విజయమన్నారు.

పులివెందులలో ఓట్ల లెక్కింపు కొనసాగించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ వ్యవహారంలో కీలక పరిణామమని పేర్కొన్నారు. ఎన్నికలను ఏదో ఒక విధంగా అడ్డుకోవాలని చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, పులివెందుల ఎన్నికల పరిణామాలు జగన్‌కు చెంపపెట్టు వంటివని వ్యాఖ్యానించారు. కుట్రలు, కుతంత్రాలు, అబద్ధపు ప్రచారాలతో రాజకీయాల్లో గెలవాలనుకునే జగన్‌కు ప్రజలు తమ తీర్పుతో గట్టి గుణపాఠం చెప్పారని ధనుంజయరావు అన్నారు. ఇప్పటికైనా ఇటువంటి రాజకీయ విధానాలను విడనాడి ప్రజాస్వామ్య విలువలను, ప్రజల తీర్పును గౌరవించాలని హితవు పలికారు. రాజకీయాల్లో ప్రజల విశ్వాసాన్ని పొందాలంటే ప్రజాసేవ, అభివృద్ధి, నిజాయితీతో కూడిన విధానాలే ప్రాతిపదిక కావాలని స్పష్టం చేశారు. లిప్రజల విశ్వాసమే కూటమి ప్రభుత్వానికి అసలైన బలమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజాభీష్టానికి అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని, స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ప్రజల అభిప్రాయాలకు ప్రతిబింబంగా నిలుస్తున్నాయని అన్నారు.

గతంలో స్థానిక సంస్థల అభివృద్ధికి ఆటంకం కలిగించిన విధానాలకు భిన్నంగా, ప్రస్తుతం స్థానిక సంస్థలకు ప్రాధాన్యతనిస్తూ వాటి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణేత ప్రజలేనని, ప్రజల తీర్పును గౌరవిస్తూ రాష్ట్రాభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, సంక్షేమ కార్యక్రమాల అమలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు స్పష్టం చేశారు.

ప్రవాసాంధ్ర

చైతన్యరథం



చార్లెట్‌లో తానా ఆధ్వర్యంలో

సక్సెస్ ఫుల్‌గా అడాప్ట్ ఏ స్ట్రీట్

అమెరికా (చైతన్యరథం): అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రం చార్లెట్ లో తానా అప్పలాచియన్ రీజియన్ ఆధ్వర్యంలో 'అడాప్ట్ ఏ స్ట్రీట్ -- ఫేజ్ 2' కార్యక్రమాన్ని శనివారం విజయవంతంగా నిర్వహించారు. దక్షిణ చార్లెట్ ప్రాంతంలోని ఆర్డీ కెల్ రోడ్, టామ్ షార్ట్ రోడ్ అనే రెండు ప్రధాన రహదారులను దత్తత తీసుకుని, వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 మంది విద్యార్థి వాలంటీర్లు తమ తల్లిదండ్రులు, తానా సభ్యులు మరియు స్థానిక నాయకత్వ బృందంతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, సామాజిక బాధ్యతపై అవగాహన పెంపొందించడంతో పాటు, స్థానిక సమాజానికి సేవ చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా చార్లెట్ సిటీ కౌన్సిల్ తానా బృందం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందించి, రెండు ముఖ్యమైన రహదారులను దత్తత తీసుకుని సమాజ సేవలో భాగస్వాములు కావడం పట్ల ప్రశంసలు వ్యక్తం చేసింది. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థి వాలంటీర్లకు, వారిని ప్రోత్సహించి సహకరించిన తల్లిదండ్రులకు, తానా సభ్యులకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారిని తానా అధ్యక్షుడు నరేన్ కొడాలి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావు ప్రత్యేకంగా అభినందించారు. తానా అప్పలాచియన్ రీజియన్ నాయకత్వ బృందం రవి (నాని) వడ్లమూడి, ఠాగూర్ మల్లినేని, కిరణ్ కొత్తపల్లి, నాగ పంచుమర్తి, మాధురి ఏలూరి, కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, స్థానిక సమాజ అభివృద్ధి లక్ష్యంగా భవిష్యత్తులోనూ ఇటువంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తానా అప్పలాచియన్ రీజియన్ చార్లెట్ ప్రతినిధులు తెలిపారు.



ప్రతినిధుల సభ స్పీకర్‌గా రంజీవ్ పూరి

ఆ పదవి చేపట్టిన తొలి భారతీయ సంతతి వ్యక్తిగా రికార్డు



మిచిగాన్ (చైతన్యరథం): రాష్ట్ర ప్రతినిధి రంజీవ్ పూరి 2027, 28 శాసనసభ కాలానికి రాష్ట్ర ప్రతినిధుల సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. ఈ పదవిని చేపట్టిన తొలి భారతీయ సంతతి వ్యక్తిగా ఆయన నిలిచారు. 110 మంది సభ్యులున్న సభలో, ఈ నెల 3వ తేదీన జరిగిన మధ్యంతర ఎన్నికలలో డెమోక్రాట్లు 63, 47 మెజారిటీని సాధించగా, కాంటన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న డెమోక్రాట్ పూరి, 5వ తేదీన తన పార్టీ సహచరులచేత ఎన్నికయ్యారు. ఆ పార్టీ గవర్నర్ పదవిని కూడా గెలుచుకుని, రాష్ట్ర సెనేట్‌పై తన నియంత్రణను నిలుపుకుంది. దీంతో శాసనసభ, గవర్నర్ కార్యాలయం రెండూ డెమోక్రాట్ల నియంత్రణలోకి వచ్చాయి. ఇక ఈ రికార్డును నెలకొల్పిన నేపథ్యంలో రంజీవ్ పూరి మాట్లాడుతూ "అమెరికాకు వలస వచ్చిన తన తల్లిదండ్రులు, తమ కుమారుడు ఒకనాడు మిచిగాన్ హౌస్‌కు నాయకత్వం వహిస్తాడని ఎన్నడూ ఊహించి ఉండరని అన్నారు. "మా తల్లిదండ్రులు ఈ దేశానికి వలస వచ్చినప్పుడు, వారి కుమారుడు ఒకనాడు చరిత్ర సృష్టిస్తాడని, అడ్డంకులను అధిగమిస్తాడని, మిచిగాన్ హౌస్‌కు నాయకత్వం వహిస్తాడని వారు ఊహించి వుండరు. కానీ సాధ్యమైంది. అమెరికా వాగ్దానమంటే ఇదే" అంటూ పేర్కొన్నారు. ఇక.. తనపై సహచరులు, ప్రజలు, నేతలు వుంచిన నమ్మకానికి పూరీ ధన్యవాదాలు ప్రకటించారు. మిచిగాన్ నివాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి రాబోయే డెమోక్రటిక్ నాయకత్వంతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నానని చెప్పారు. గత రెండేళ్లుగా హౌస్ డెమోక్రటిక్‌లు రాష్ట్రమంతటా పర్యటించి, తమ ప్రభుత్వం నుండి ప్రజలకు ఏమి కావాలో మరియు వారికి మరింత మెరుగ్గా ఎలా సేవ చేయగలరో అడిగి తెలుసుకున్నారని పూరి చెప్పారు.ఈ ప్రయత్నం కేవలం ఎన్నికల్లో గెలవడం కోసం కాదని, ప్రజల ఆందోళనలను అర్థం చేసుకోవడం రాష్ట్రాన్ని మెరుగుపరిచే మార్గాలను కనుగొనడం కోసమని ఆయన అన్నారు.ఇక.. ప్రజలు ఫలితాలను అనుభవించే సమయం ప్రారంభం అవుతుందని పూరీ ప్రకటించారు. ఖర్చులను తగ్గించడం, ఆరోగ్య సంరక్షణ అందుబాటును కాపాడటం, మరియు "ట్రంప్ గందరగోళం"గా ఆయన అభివర్ణించిన దాని నుండి మిచిగాన్‌ను రక్షించడం వంటివి రాబోయే పరిపాలన యొక్క ప్రాధాన్యతలలో ఉన్నాయని ఆయన గుర్తించారు. హౌస్ డెమోక్రాటిక్ కాకస్‌లో 63 మంది సభ్యులు ఉన్నందున, తమ అజెండాను ఆచరణలో పెట్టడానికి పార్టీ ఆసక్తిగా ఉందని ఆయన అన్నారు.పూరి 2020లో మిచిగాన్ హౌస్‌కు ఎన్నికైన మొదటి సిక్కు అమెరికన్‌గా చరిత్ర సృష్టించారు. రిపబ్లికన్లు సభపై నియంత్రణ కలిగి ఉన్న సమయంలోనే, ఆయన డెమోక్రటిక్ కాకస్‌కు నాయకత్వం వహించేందుకు ఎంపికయ్యారు.

ఆపత్కాలంలో అండగా ఉత్తర అమెరికా తెలుగు సంఘం





మైనంపాడు తుపాను బాధితులకు తానా ఆపన్నహస్తం

చిన్నారులు, పెద్దలకు భోజనాల పంపిణీ



ఒంగోలు (చైతన్యరథం): ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని మైనంపాడు గ్రామంలో భారీ తుఫాన్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆపన్నహస్తం అందించింది. తుఫాన్ ప్రభావంతో మైనంపాడు గ్రామంలోని కుటుంబాల నివాసాల్లోకి వరదనీరు చేరడంతో వంట చేసుకునే పరిస్థితి లేక చిన్నారులు, పెద్దలు ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్న విషయం తానా దృష్టికి వచ్చింది. ఈ పరిస్థితికి వెంటనే స్పందించిన తానా కోశాధికారి రాజా కసుకుర్తి, బాధిత కుటుంబాలకు తానా ఆధ్వర్యంలో భోజనాలు అందించేలా చర్యలు తీసుకున్నారు. తానా ఆధ్వర్యంలో చిన్నారులు, మహిళలు, వృద్ధులు సహా బాధిత కుటుంబాలకు పౌష్టికాహారంతో కూడిన భోజనాలను పంపిణీ చేశారు. విపత్కర పరిస్థితుల్లో తమ ఆకలిని తీర్చేందుకు ముందుకు వచ్చిన తానా సేవలను స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా తానా కోశాధికారి రాజా కసుకుర్తి మాట్లాడుతూ, "ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం మనందరి సామాజిక బాధ్యత. అవసరంలో ఉన్నవారికి సకాలంలో సహాయం అందించడమే తానా సేవా లక్ష్యం" అని పేర్కొన్నారు. ఉత్తర అమెరికాలో తెలుగు సంస్కృతి పరిరక్షణతో పాటు తెలుగు రాష్ట్రాల్లో విద్య, వైద్యం, సామాజిక సేవలు, విపత్తు సహాయక కార్యక్రమాల ద్వారా తానా నిరంతరం సేవలందిస్తోంది.





ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు త్వరలో నగారా!

షెడ్యూల్ విడుదలపైకేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు



దేశంలోని ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు మరికొద్ది రోజుల్లో నగారా మోగనుంది. అందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) కసరత్తు చేపట్టింది. జనవరి మాసం ప్రథమ, ద్వితీయార్థంలో ఈ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఫిబ్రవరి, మార్చి మాసాల్లో పోలింగ్ ప్రక్రియ పూర్తి చేసేలా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్, ఈవీఎంల తనిఖీలను ఎన్నికల సంఘం (ఈసీ) వేగవంతం చేసింది. ఎన్నికల కోడ్ అమల్లోకి రాక ముందే ఈ రాష్ట్రాల్లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు జోరందుకున్నాయి. ఇక ఎన్నికల షెడ్యూల్ సంకేతాలతో ఆయా రాష్ట్రాల్లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అయితే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపుర్‌లలో అధికార పీఠాన్ని దక్కించుకోవాలని బీజేపీ పట్టుదలతో ఉంది. ఇక పంజాబ్‌లో మళ్లీ అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తన వంతు ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా పుంజుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. మరో వైపు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలోని 403 సీట్లపైనే అందరి దృష్టి ఉంది. ఈ ఫలితాలు దేశ రాజధాని ఢిల్లీ రాజకీయాలను శాసిస్తాయనే చర్చ సాగుతోంది.



అత్యాచార ఆరోపణలతో టీఎంసీ ఎమ్మెల్యే అరెస్టు

అత్యాచార ఆరోపణల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టీఎంసీ) ఎమ్మెల్యే పరేష్‌రామ్ దాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం సాయంత్రం ముంబై వెళ్లేందుకు కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌లో విమానం ఎక్కుతుండగా ఆయనను బారుయిపూర్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. దాదాపు 17 రోజులుగా ఆయన అజ్ఞాతంలో ఉన్నారు. ముంబై వెళ్లేందుకు ఆయన ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లినట్లు పోలీసులకు సమాచారం అందడంతో వారు అప్రమత్తమయ్యారు. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని కానింగ్ పశ్చిమ నియోజకవర్గానికి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఓ మహిళపై అత్యాచారం, బెదిరింపులు, దోపిడీ తదితర కేసులు ఎమ్మెల్యే దాస్‌పై నమోదయ్యాయి. దీంతో ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు.

యూపీలో ఏడాది ముందే బీజేపీ ఎన్నికల ఏర్పాట్లు

209 స్థానాలకు అభ్యర్థుల పేరు ఖరారయినట్లు కథనాలు



వచ్చే ఏడాది యూపీ ఎన్నికలకు అధికార బీజేపీ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. దీపావళి ముగిసిన వెంటనే కార్యరంగంలోకి దిగింది. ఇప్పటికే 209 స్థానాలకు అభ్యర్థుల పేర్లు ఖరారైనట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తుది అనుమతుల కోసం ఈ జాబితాను కేంద్ర నాయకత్వానికి పంపించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో 300 పైచిలుకు స్థానాల్లో విజయం సాధించి మూడోసారి అధికార పగ్గాలు చేపట్టే లక్ష్యంగా బీజేపీ వడివడిగా అడుగులు వేస్తోంది. దీపావళి ముగిసిన మరుసటి రోజే రాష్ట్ర నాయకత్వం క్షేత్రస్థాయిలో ఎన్నికల ఏర్పాట్లు ప్రారంభించింది. మొత్తం 403 స్థానాలకు 209 స్థానాల్లో ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేసినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో అభ్యర్థులకు ప్రచారానికి, ప్రజలతో మమేకం అయ్యేందుకు తగినంత సమయం ఉండాలనే లక్ష్యంతో ముందుగా అభ్యర్థుల జాబితాను రాష్ట్ర నాయకత్వం సిద్ధం చేసినట్లు సమాచారం. జాతీయ మీడియా కథనాల ప్రకారం, తొలి దశలో అభ్యర్థులుగా ఖరారైన వారిని ఏ కేటగిరీగా పార్టీ పరిగణిస్తోందని సమాచారం. సీఎం యోగితో సమాలోచనల అనంతరం వీరి పేర్లు ఖరారయ్యాయి. కేంద్ర నాయకత్వం నుంచి తుది అనుమతులు రాగానే అభ్యర్థులకు ఎన్నికల ఏర్పాట్లు చేసుకునేందుకు రాష్ట్ర నాయకత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. ఈసారి ఎన్నికల్లో పార్టీ నాయకత్వం రాష్ట్రంలోని మహిళా ఓటర్లపై ప్రత్యేక ఫోకస్ పెట్టే అవకాశం ఉంది. మహిళల అభ్యున్నతికి ప్రత్యేక ప్యాకేజీ తెస్తున్నామని సీఎం యోగి ఆదివారం ప్రకటించిన విషయం తెలిసిందే.

కాశీలో అంత్యక్రియలకు వెళుతుండగా రోడ్డు ప్రమాదం

ఏడుగురి మృతి, 14 మందికి తీవ్ర గాయాలు

కాశీలో అంత్యక్రియలు నిర్వహించేందుకు వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు మరణించిన ఘటన ఝార్ఖండ్‌లో తాజాగా వెలుగు చూసింది. ఓ వాహనంలో మృతదేహాన్ని తీసుకుని వెళుతుండగా హజారీబాగ్ జిల్లా దానువా వ్యాలీ వద్ద రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. ఘటనలో ఏడుగురు మరణించగా 14 మంది గాయపడ్డారు. బాధితులకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం, బాగోదార్ ప్రాంతానికి చెందిన కొందరు తమ వాహనంలో మృతదేహాన్ని తీసుకుని కాశీకి బయలుదేరారు. అయితే, కాలకృత్యాలు తీర్చుకునేందుకు వారు దానువా వ్యాలీ వద్ద వాహనాన్ని ఆపుతుండగా ప్రమాదం జరిగింది. డ్రైవర్ కారును రోడ్డు పక్కన నిలుపుతున్న సమయంలో ఓ ట్రక్కు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. గాయపడ్డ వారికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా ఏడుగురు కన్నుమూశారు. చికిత్స పొందుతున్న 14 మందిలో కొందరిని మెరుగైన చికిత్స కోసం హజారీబాగ్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

25 వరకూ ఏరియల్ ఫైర్ క్రాకర్స్‌పై నిషేధం



దీపావళి వేడుకల్లో అగ్నిప్రమాదాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ముంబై విపత్తు నిర్వహణ సంస్థ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. రాకెట్లు, గాల్లోకి ఎగిరి పేలిపోయే ఏరియల్ ఫైర్ క్రాకర్స్‌ను నవంబర్ 25 వరకూ నిషేధిస్తున్నట్లు తెలిపింది. నగరవ్యాప్తంగా ఈ నిషేధం అమల్లో ఉంటుందని చెప్పింది. పబ్లిక్, ప్రైవేటు ప్రదేశాలతో పాటు భవనాలు, టెర్రస్‌లు, బాల్కనీలు, పార్కింగ్ స్థలాలు, స్లమ్ ఏరియాలు సహా ఎక్కడా ఈ టపాసులను కాల్చకూడదని స్పష్టం చేసింది. నేటి నుంచి అమల్లోకి వచ్చిన ఈ నిషేధం నవంబర్ 25 రాత్రి 11.59 గంటల వరకూ అమల్లో ఉంటుందని నగర విపత్తు నిర్వహణ సంస్థ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్, అడిషనల్ మున్సిపల్ కమిషనర్ తెలిపారు.రాకెట్లు, గాల్లోకి ఎగిరి పేలే ఇతర టపాసులు భవనాలపై, బాల్కనీలు, కిటికీలు, పేలుడు పదార్థాలపై పడి అగ్నిప్రమాదాలకు కారణమవుతున్నాయని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాలు, బహుళ అంతస్తుల భవనాలు, ఇరుకు సందులు, వాణిజ్య సముదాయాలకు ఏరియల్ ఫైర్ క్రాకర్స్ వల్ల ప్రాణ, ఆస్తి నష్టం ముప్పు మరింత ఎక్కువగా ఉందని తెలిపింది. ఈ అంశంపై ముంబై మేయర్ నీతు తావ్డే మాట్లాడుతూ భవనాలకు సమీపంలో టపాసులు కాల్చవద్దని ప్రజలకు విజ్ఞప్తి కూడా చేశారు.నవంబర్ 8న నగరంలో 137 అగ్నిప్రమాదాలు జరిగిన నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఘటనల్లో ఇద్దరు మహిళలు గాయపడ్డట్టు బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. టపాసుల వల్ల అగ్నిప్రమాదాల సంఖ్య గతంతో పోలిస్తే పెరిగిందని అధికారులు చెబుతున్నారు. దీపావళి సందర్భంగా 2024లో ముంబైలో 262 అగ్నిప్రమాదాలు సంభవించాయి. వీటిల్లో 80 టపాసుల వల్లే జరిగాయి. ఈ ఘటనల్లో ముగ్గురు మరణించారు. ఇక 2025లో 289 అగ్నిప్రమాదాలు జరగ్గా వీటిల్లో టపాసుల వల్ల సంభవించిన ప్రమాదాలు 113. అయితే, గతేడాది ప్రమాదాల్లో మరణాలేవీ నమోదు కాలేదు.



దేశ వాప్తంగా కేంద్ర భద్రతా బలగాలు హై అలర్ట్ !

ఎర్రకోట పేలుడుకు నేటితో ఏడాది పూర్తి

ఎర్రకోట పేలుడుకు రేపటితో ఏడాది పూర్తికానుంది. దీంతో దేశవ్యాప్తంగా కేంద్ర భద్రతా బలగాలు హై అలర్ట్ అయ్యాయి. ఆ పేలుడు జరిగినప్పటి నుంచి చేపట్టిన వివిధ ఆపరేషన్లలో 300 మందికి పైగా నిందితులను అరెస్టు చేశారు. మరోవైపు ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. శ్రీనగర్ పోలీసుల చొరవతో 'డాక్టర్ మాడ్యూల్' కుట్ర కోణం వెలుగులోకి వచ్చింది. ఫరీదాబాద్‌లోని అల్ ఫలా వర్సిటీ సమీపంలో 2,900 కేజీల పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో ప్రధాన సూత్రధారి డాక్టర్ ఉమర్, ఉన్ నబీ వాహన పేలుడులోనే మృతి చెందాడు. ఫిబ్రవరి 23న 'ప్రహార్' పేరుతో నూతన జాతీయ కౌంటర్ టెర్రరిజం పాలసీని ప్రారంభించారు. పాక్ ఆధారిత ఎస్‌బీఎన్ నెట్‌వర్క్‌పై 100కు పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. 300 మందికి పైగా ఆపరేటివ్‌లను అరెస్టు చేశారు. విదేశాల్లో పరారీలో ఉన్న ఉగ్రవాదులను వేగంగా రప్పించేందుకు సెప్టెంబర్‌లో ఎక్స్‌ట్రడిషన్ పోర్టల్ ప్రారంభించారు. జైషే మహమ్మద్, లష్కరే తొయిబా, ఖలిస్థాన్, జేఎంబీ ఉగ్ర మాడ్యూళ్లను భద్రతా బలగాలు, పోలీసులు ధ్వంసం చేశారు. అలాగే రసాయనాలు, అమ్మోనియం నైట్రేట్ విక్రయాలపై దేశవ్యాప్తంగా భద్రతా బలగాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి.

సందిగ్ధంలో ఇజ్రాయెల్ ప్రభుత్వ ఏర్పాటు



ఇటీవలి ఇజ్రాయెల్ ఎన్నికల్లో ఏ పార్టీకీ సంపూర్ణ మెజారిటీ రాకపోవడంతో ప్రభుత్వ ఏర్పాటు సందిగ్ధంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రధాని నెతన్యాహు వ్యతిరేక కూటమికి నేతృత్వం వహిస్తున్న మరో కీలక నేత గడీ ఐసెన్‌కోట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని అధ్యక్షుడు ఐసాక్ హెర్జోగ్ ఆహ్వానం పలికారు. ఈ దిశగా ఆయనకు 28 రోజుల సమయం ఇచ్చారు. 120 మంది సభ్యులు ఉన్న ఇజ్రాయెల్ పార్లమెంటులో (క్నెసెట్) ప్రభుత్వ ఏర్పాటుకు 61 మంది మద్దతు తప్పనిసరి. ఐసెన్‌కోట్‌కు మద్దతుగా అధ్యక్షుడికి 67 మంది చట్టసభ సభ్యులు లేఖలు రాశారు. కానీ ప్రభుత్వ ఏర్పాటు అంత సులభం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు. మద్దతు ప్రకటించడం, ఐసెన్‌కోట్ సారథ్యంలోని ప్రభుత్వంలో కొనసాగడం ఒకటి కాదని వ్యాఖ్యానిస్తున్నారు. ఐసెన్‌కోట్ సారథ్యంలోని నెతన్యాహు వ్యతిరేక కూటమికి 48 మంది సభ్యుల బలం ఉంది. ఇందులో ఆయన సొంత పార్టీ యషర్‌కు 21 మంది చట్టసభ సభ్యులు ఉన్నారు. టూగెదర్ పార్టీ బలం 12. డెమోక్రాట్లకు 8 మంది, ఇజ్రాయెల్ బెయిటినూ పార్టీకి ఏడుగురి బలం ఉంది. రెండు అరబ్ పార్టీలకున్న 19 మంది సభ్యుల బలాన్నీ కలుపుకుంటే కూటమి సంఖ్య 67కు చేరుతుంది. అయితే, నెతన్యాహుపై వ్యతిరేకత మినహా ఈ పార్టీలను కలిపి ఉంచే మరో అంశం లేనేలేదని అక్కడి పరిశీలకులు కామెంట్ చేస్తున్నారు. అరబ్ పార్టీల మద్దతుతో ముందుకు వెళ్లడం ప్రస్తుతం అక్కడి ప్రధాన పార్టీల ముందున్న సులువైన మార్గం. అయితే, సంప్రదాయ వాదిగా పేరున్న అవిగ్డోర్ లిబర్‌మన్ సారథ్యంలోని ఇజ్రాయెల్ బెయిటినూ మాత్రం అరబ్ పార్టీలతో జట్టు కట్టే ప్రతిపాదనను ఎప్పటి నుంచో వ్యతిరేకిస్తున్నారు. దీంతో, అరబ్ పార్టీల దన్నుతో ప్రభుత్వం ఏర్పడినా ఎంతకాలం మనగలదో చెప్పలేని పరిస్థితి ఉందనేది కొందరి వాదన.



డీల్ కుదరకపోతే దాడులే!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

ఇరాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో మరోసారి యుద్ధం చేయాల్సిన పరిస్థితి తలెత్తే అవకాశాలు అత్యంత తక్కువ అని అన్నారు. అయితే.. ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలు, హోర్మూజ్ జలసంధిని మళ్లీ తెరిచే అంశాలపై గట్టి ఒప్పందం కుదరాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ డీల్‌కు ఇరాన్ అంగీకరించకపోతే తాము మరోసారి సైనిక దాడులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. పశ్చిమాసియాలో అమెరికా 3 విమాన వాహక యుద్ధనౌకలను మోహరించిందని, అవి పూర్తిస్థాయిలో పోరాటానికి సిద్ధంగా ఉన్నాయని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలు, వంతెనలు సహా కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా గుర్తించినట్లు వెల్లడించారు. అయితే.. వాటిని ధ్వంసం చేస్తే పునర్నిర్మాణానికి పదేళ్ల సమయం పట్టొచ్చని, అందుకే అలాంటి చర్యలు తీసుకోవడం తనకిష్టం లేదని పేర్కొన్నారు.

ఈజిప్టులో రైలు ప్రమాదం : 8 మంది మృతి



ఈజిప్టులో ఆదివారం రైలు ప్రమాదం సంభవించింది. ఒక రైలును మరో రైలు వెనక నుంచి వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనలో నలుగురు మరణించగా 88 మంది గాయాల పాలయ్యారు. పలు బోగీలు పట్టాలు తప్పాయి. గిజా ప్రావిన్స్‌లో ఈ ప్రమాదం జరిగింది. కైరో నుంచి అస్వాన్‌కు వెళుతున్న రైలును గిజా నుంచి ఫయోమ్‌కు వెళుతున్న రైలు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్టు అక్కడి ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. సమాచారం అందిన వెంటనే అక్కడకు చేరుకున్న ఎమర్జెన్సీ సిబ్బంది క్షతగాత్రులను కాపాడేందుకు సహాయక చర్యలు ప్రారంభించారు.



కలకలం రేపుతున్న ఎన్విడియా సీఈఓ ఎఫైర్!



ప్రముఖ మైక్రోచిప్ తయారీ సంస్థ ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్.. ఆలిస్ అనే మహిళతో రోమాంటిక్ బంధంలో ఉన్నారన్న విషయం ప్రస్తుతం అమెరికాలో కలకలం రేపుతోంది. ఆమె చైనా గూఢచారిణి అన్న వార్తలు వెలువడ్డ మరుసటి రోజే వారి బంధం బయటపడటం కలకలానికి దారి తీసింది. అయితే, వారి తీరు అనుమానాస్పదంగా ఉందన్న విషయం ఆరు నెలల క్రితమే వెలుగులోకి వచ్చింది. యూఎస్ షార్ట్ సెల్లర్ కుల్పర్ రీసెర్చ్ సంస్థ నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వారి మధ్య ఎఫైర్ ఉన్నట్టు సంస్థ నేరుగా ప్రకటించనప్పటికీ ఆ ఇద్దరూ మరీ క్లోజ్‌గా ఉన్నట్టు తన నివేదికలో పేర్కొంది. చైనా గూఢచారిణిగా అమెరికా మీడియా చెబుతున్న ఆలిస్ హువాంగ్ సింగ్‌పూర్ సంస్థ మెగాస్పీడ్‌లో ఉన్నతాధికారిగా చేశారు. చైనా కంపెనీల కోసం అమెరికా సంస్థల నుంచి మెగా స్పీడ్ అత్యాధునిక కంప్యూటర్ చిప్స్‌ను కొనుగోలు చేసేది. వీటిని అలీబాబా లాంటి సంస్థలకు కూడా మెగాస్పీడ్ సరఫరా చేసినట్టు వార్తలు వెలువడ్డాయి. ఎన్విడియా కంపెనీ షేర్ల షార్టింగ్‌కు కుల్పర్ రీసెర్చ్ సంస్థ సిద్ధమవుతున్న తరుణంలోనే నివేదిక కూడా బయట పడింది. ఓ సంస్థ షేర్లు పతనమవుతాయన్న అంచనాతో లాభపడేందుకు వాటితో స్టాక్ మార్కెట్ డీలింగ్స్ నిర్వహించడాన్ని షార్టింగ్ అంటారన్న విషయం తెలిసిందే. ఇక తన అనుమానాలకు బలం చేకూర్చేలా కుల్పర్ రీసెర్చ్ రెండు ఉదంతాలను కూడా ప్రస్తావించింది. 2024లో వారిద్దరూ తైవాన్‌లో ఓ సమావేశానికి హాజరైన విషయాన్ని పేర్కొంది. ఆ మరుసటి ఏడాది చైనాపై అమెరికా చిప్ ఎగుమతులపై ఆంక్షలు విధించిన తరువాత కూడా వారు హాంకాంగ్‌లో కనిపించారని చెప్పింది. ఆ సమయంలో బహిరంగంగా జెన్సన్‌తో కనిపించేందుకు ఆలిస్ విముఖత వ్యక్తం చేసినట్టు కూడా కుల్పర్ తన నివేదికలో పేర్కొంది. వారు అసాధారణ రీతిలో సన్నిహితంగా కనిపించారని పేర్కొంది. ఎగుమతులపై ఆంక్షల సడలింపు విషయంలో జెన్సన్ చైనా పక్షాన నిలిచేలా చూడాల్సిన బాధ్యత ఆలిస్‌కు అప్పగించినట్టు కథనాలు వెలువడ్డాయి. తన చుట్టూ మారుతున్న పరిణామాల గురించి జెన్సన్‌కు తెలుసా? లేదా? అన్న విషయాలపై మాత్రం స్పష్టత లేదు. ఆలిస్ తమ గూఢచారిణి అన్న వార్తలనూ చైనా తోసిపుచ్చింది. అయితే, ఆలిస్ తమ సంస్థను వీడినా తమ బాస్‌గానే ఉంటున్నారని మెగాస్పీడ్ సంస్థ ఉద్యోగి ఒకరు కుల్పర్‌కు తెలిపారు. జెన్సన్ తరచూ తమ సంస్థ డేటా సెంటర్స్‌కు వస్తుండేవారని కూడా అన్నారు. ఆ సమయంలో అలీబాబా సంస్థ ప్రతినిధులు కూడా వచ్చేవారని చెప్పారు. 2026 ఆర్థిక సంవత్సరంలో ఎన్విడియా ఆదాయంలో 20 శాతం చైనా నుంచే వచ్చిందని కుల్పర్ సంస్థ తన నివేదికలో పేర్కొంది. ఆగ్నేయాసియా మీదుగా ఎన్విడియా ఉత్పత్తులు చైనాకు అక్రమంగా చేరేవని చెప్పింది. కుల్పర్ నివేదిక ఆరు నెలల క్రితం వెలుగులోకి వచ్చింది. అంతకుముందు నుంచే అమెరికా నిఘా సంస్థలు వారి బంధంపై దర్యాప్తు ప్రారంభించినట్టు సమాచారం. ఏడాది క్రితమే తొలిసారిగా ఈ విషయాన్ని అమెరికా నిఘా సంస్థలు అధ్యక్షుడు ట్రంప్ చెవిన వేసినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తమ మధ్య వివాహేతర సంబంధం ఉందన్న విషయాన్ని జెన్సన్ హువాంగ్ తాజాగా అంగీకరించారు. తన భార్య, పిల్లలకు క్షమాపణ కూడా చెప్పారు.



పశ్చిమ ఆఫ్రికాలో ఘోర పడవ ప్రమాదం : 21 మంది మృతి

గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు : సెనెగల్ ప్రభుత్వం వెల్లడి

పశ్చిమ ఆఫ్రికా దేశమైన సెనెగల్ తీరంలో ఘోర పడవ ప్రమాదం చోటుచేసుకుంది. శనివారం వలసదారులతో ప్రయాణిస్తున్న పడవ.. అట్లాంటిక్ మహాసముద్రంలో మునిగిపోయింది. ఈ ప్రమాదంలో 21 మంది మృతిచెందగా.. ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడినట్లు సెనెగల్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదివారం వెల్లడించింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. సెనెగల్ రాజధాని డకార్‌కు ఉత్తరాన 180 కిలోమీటర్ల దూరంలోని కెబెమెర్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. సముద్రంలో పడవ మునిగిపోయిందన్న సమాచారంతో సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. ఇప్పటివరకు 21 మృతదేహాలను వెలికితీయగా.. ఒకరిని సజీవంగా రక్షించారు. సముద్రంలో కొనసాగుతున్నాయి. అయితే ప్రమాద సమయంలో పడవలో ఎంతమంది ప్రయాణిస్తున్నారనే విషయాన్ని అధికారులు వెల్లడించలేదు. దీంతో ఇంకా ఎంతమంది గల్లంతయ్యారనే దానిపై స్పష్టత లేదు. మరోవైపు, ఈ ప్రమాదంపై సెనెగల్ ప్రభుత్వం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపింది. అక్రమ వలసలకు పాల్పడే వ్యక్తుల నెట్‌వర్క్‌లను అరికట్టేందుకు పొరుగు దేశాలతో కలిసి పనిచేస్తామని స్పష్టం చేసింది. కాగా, పశ్చిమ ఆఫ్రికా నుంచి స్పెయిన్‌లోని కానరీ దీవులకు అట్లాంటిక్ మహాసముద్రం మీదుగా వెళ్లే మార్గం ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన వలస మార్గాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. మెరుగైన జీవనోపాధి, ఉపాధి అవకాశాల కోసం అనేక మంది ఈ మార్గంలో ఐరోపాకు చేరుకోవాలని ప్రయత్నిస్తున్నారు. అయితే సరైన భద్రత లేని చిన్న పడవల్లో సముద్ర ప్రయాణం చేయడం ప్రాణాలకే ముప్పుగా మారుతోంది.

స్పెయిన్‌కు చెందిన వలసదారుల హక్కుల సంస్థ వాకింగ్ బోర్డర్స్ గణాంకాల ప్రకారం.. 2026 తొలి ఐదు నెలల్లోనే ఈ అట్లాంటిక్ మార్గంలో కనీసం 635 మంది ప్రాణాలు కోల్పోయారు. కానరీ దీవులకు వెళ్తున్న ప్రతి 100 మందిలో సుమారు 21 మంది సముద్ర ప్రయాణంలో మరణిస్తున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది.

కివీస్‌తో మూడో వన్డేకీ వర్షం ముప్పు?

హామిల్టన్‌లో గెలిచి సిరీస్ పట్టేయాలనే పట్టుదలతో భారత్

భారత్ న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న వన్డే సిరీస్ కు వర్షం పదేపదే అడ్డంకిగా మారుతోంది. ఇప్పటికే తొలి రెండు మ్యాచ్లకు వర్షం అంతరాయం కలిగించగా.. మంగళవారం హామిల్టన్లోని సెడాన్ పార్క్ వేదిక వేదికగా జరగనున్న మూడో వన్డేకూ వర్షం ముప్పు పొంచి ఉంది. సోమవారం అవుట్ డోర్‌లో ప్రాక్టీస్ స్దర్భంగా కెప్టెన్ శుభ్మన్ గిల్, సీనియర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, సిరాజ్, కేఎల్ రాహుల్, తదితరులు ఫుట్బాల్ ఆడారు. కాసేపు రన్నింగ్ ప్రాక్టీస్ చేశారు. అంతో వర్షం రావడంతో సాధన ఇండోర్ స్టేడియంలోకి మారిపోయింది. బాగా మబ్బులు పట్టి ఉండటంతో మంగళవారం నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆటగాళ్లతోపాటు అభిమానుల్లోనూ కాస్త ఆందోళన నెలకొంది. మంగళవారం హామిల్టన్లో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ సంస్థ తెలిపింది.


తొలి రెండు వన్డేల్లోనూ విజయం సాధించిన భారత్ ఐదు మ్యాచ్ల సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో ఉంది. ఆక్లాండ్ లో జరిగిన తొలి వన్డేలో డక్ వర్త్ లూయిస్ (డీఎల్ఎస్) పద్ధతిలో ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. వెల్లింగ్టన్లో నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడో వన్డేలోనూ గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని టీమ్ ఇండియా పట్టుదలగా ఉంది.

ఒకవేళ మిగతా మూడింట్లో ఒక్కటి వర్షం కారణంగా రద్దు అయినా.. భారత్‌కు సిరీస్‌ను కోల్పోయే ప్రమాదం మాత్రం ఉండదు. అలా కాకుండా కనీసం ఒక్కటి గెలిచినా వన్డే సిరీస్ కూడా టీమ్ ఇండియా ఖాతాలో పడిపోతుంది. ఇప్పటికే టీ20 సిరీస్‌ను భారత్ 3-2 తేడాతో కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే.

భారత్ గెలిస్తే రికార్డే..

వన్డే సిరీస్‌లో టీమిండియా గెలిస్తే మాత్రం న్యూజిలాండ్ గడ్డపై చరిత్ర సృష్టించనుంది. అదేంటంటే, స్వదేశంలో 2019 నుంచి వరుసగా న్యూజిలాండ్ ఓటమన్నదే ఎరుగకుండా వరుసగా 11 వన్డే సిరీస్‌లో నెగ్గింది. ఆఖరిసారి అంటే 2019లో న్యూజిలాండ్ తమ సొంతగడ్డపై వన్డే సిరీస్‌ను భారత్‌కు కోల్పోయింది. ఏడేళ్ల తర్వాత మళ్లీ కివీస్‌ను వారి గడ్డపైనే ఓడించి వన్డే సిరీస్ ను కైవసం చేసుకునే అరుదైన అవకాశం టీమిండియా ముంగిట నిలిచింది. సొంతగడ్డపై వన్డే సిరీస్‌ను కోల్పోయే ప్రమాదం న్యూజిలాండ్ జట్టును ఒత్తిడిలోకి నెట్టేసింది.

ఇక టెస్టు సిరీస్ కు సన్నాహకాల్లో భాగంగా భారత వన్డే కెప్టెన్ శుభ్మన్ గిల్ మూడో వన్డే అనంతరం జట్టును వీడనున్నాడు. అతడి స్థానంలో శ్రేయస్ అయ్యర్ సారథ్య బాధ్యతలు తీసుకోనున్నాడు.





న్యూజిలాండ్ తుదిజట్టు అంచనా: విల్ యంగ్, టిమ్ సీఫెర్ట్, హెన్రీ నికోల్స్, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, టామ్ లాథమ్ (వికెట్ కీపర్), మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), నాథన్ స్మిత్, కైల్ జేమీసన్, మాట్ ఫిషర్/క్రిస్టియన్ క్లార్క్, జాకబ్ డఫీ

భారత్ తుదిజట్టు అంచనా: రోహిత్ శర్మ, శుభ్మన్ గిల్ (కెప్టెన్), విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నమన్ ధీర్, అక్షర్ పటేల్, అన్షుల్ కాంబోజ్, అకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్, అర్షదీప్ సింగ్

భారత్ పేసర్లు భళా!



భారత పేసర్లు తమ బౌలింగ్‌తో న్యూజిలాండ్ బ్యాటర్లకు చుక్కలు చూపిస్తున్నారు. స్వదేశంలో సాధారణంగా ఫ్లాట్ పిచ్‌లపై బౌలింగ్ చేసే మన యువ బౌలర్లు.. న్యూజిలాండ్ పర్యటనలో పిచ్‌లను, అక్కడి పరిస్థితులను అద్భుతంగా ఉపయోగించుకుంటున్నారు. తొలి రెండు వన్డేల్లో భారత పేసర్లు చెలరేగిపోయారు. ప్రత్యర్థిని 185, 134 పరుగులకే కట్టడి చేసి టీమ్ ఇండియా విజయాల్లో కీలక పాత్ర పోషించారు. మొత్తం 20 వికెట్లలో గుర్నూర్ బ్రార్ (7), అర్షదీప్ (4), అంశుల్ కాంబోజ్ (4), అకిబ్ నబీ (2) కలిసి 17 వికెట్లు పడగొట్టారు. హామిల్టన్ వేదికగా మూడో మ్యాచ్ మంగళవారం జరగనుంది. ఈ నేపథ్యంలో భారత్ పేస్ దాడిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని కివీస్ బ్యాటింగ్ కోచ్ ల్యూక్ రాంచీ స్పష్టం చేశాడు. మూడో మ్యాచ్‌కు ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రాంచీ మాట్లాడుతూ భారత బౌలర్లపై ప్రశంసల వర్షం కురిపించాడు.

'భారత బౌలర్లు చాలా బాగా బౌలింగ్ చేస్తున్నారు. మా బ్యాటర్లను నిరంతరం పరీక్షిస్తున్నారు. సాధారణంగా ఫ్లాట్ పిచ్‌లపై బౌలింగ్ చేయడానికి అలవాటు పడిన భారత పేసర్లు.. ఇప్పుడు కివీస్ పిచ్‌లపై కూడా రాణిస్తున్నారు. పరిస్థితులను వారికి అనుగుణంగా ఉపయోగించుకుంటున్నారు. ఇక్కడ సరైన లెంగ్త్ ఏది? ఏ లైన్‌లో బౌలింగ్ చేయాలి? బంతి స్వింగ్ అవుతున్నప్పుడు బ్యాటర్లను ఎలా ఇబ్బంది పెట్టాలి? అన్న విషయాలను త్వరగా అర్థం చేసుకున్నారు. మా బ్యాటర్లను సవాల్ చేస్తూ ఆరంభంలోనే వికెట్లు తీస్తూ మిమ్మల్ని కష్టాల్లోకి నెడుతున్నారు. రెండు మ్యాచ్‌ల్లోనూ విభిన్నంగా ప్రభావం చూపించారు. యువ ఆటగాళ్లు జట్టులోకి వచ్చి తమ ప్రతిభను నిరూపించుకోవడం చూడటం చాలా ఆనందంగా ఉంది' అని రాంచీ పేర్కొన్నాడు.

ఇప్పటి వరకు ఆడిన రెండు వన్డేలకు వినియోగించిన పిచ్లు ఇరు జట్ల అంచనాలకు అనుగుణంగా లేవు. టీ20ల్లో ఎక్కువగా పరుగులు వచ్చినా.. వన్డేల్లో మాత్రం సవాల్ ఎదురైంది. తొలి ఇన్నింగ్స్ ల్లో 200 పై చిలుకు స్కోరు చేసినా ప్రత్యర్థికి మంచి లక్ష్యం ఇచ్చినట్లే. పిచ్‌ను ఎంత త్వరగా అలవాటు చేసుకుంటే.. పరుగులు చేయడానికి ఎక్కువ అవకాశం వస్తుంది. చివరి రెండు వన్డేలు జరిగే మౌంట్ మౌంగన్యూ పిచ్ మాత్రం తొలి మూడు మ్యాచ్‌లు జరిగిన పిచ్‌లతో పోలిస్తే భిన్నమైనదని రాంచీ వెల్లడించాడు. అయితే పిచ్ సహకరించినంత మాత్రాన సరిపోదు. బౌలర్లు కూడా అద్భుతంగా బౌలింగ్ చేయాలి. ఈ సిరీస్‌లో రెండు జట్ల బౌలర్లు అదే చేస్తున్నారని రాంజీ అన్నాడు.

సౌతాఫ్రికా పర్యటన: మూడు ఫార్మాట్లకు కెప్టెన్‌గా స్మృతి

భారత మహిళా క్రికెట్ జట్టు వచ్చే నెలలో సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది. డిసెంబర్ 9 నుంచి 30 వరకు జరిగే సిరీస్‌లో ప్రొటీస్ టీమ్‌తో 3 టీ20లు, 3 వన్డేలు, 1 టెస్టు మ్యాచ్‌ను భారత్ ఆడనుంది. దీనికి సంబంధించిన జట్లను బీసీసీఐ తాజాగా ప్రకటించింది. మూడు ఫార్మాట్లకూ స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించనుంది. కాగా ఫుల్ టైమ్ టెస్టు కెప్టెన్‌గా స్మృతికి ఇదే తొలి టూర్ కావడం విశేషం.

టెస్టు జట్టు: స్మృతి మంధాన(కెప్టెన్), షఫాలీ వర్మ, ప్రతీక రావల్, హర్మన్‌ప్రీత్ సింగ్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్(వికెట్ కీపర్), యస్తిక భాటియా(వికెట్ కీపర్), దీప్తి శర్మ, శ్రీచరణి, స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్, నందని శర్మ, జింతిమణి, సయాలి.

వన్డే జట్టు: స్మృతి మంధాన(కెప్టెన్), షఫాలీ వర్మ, ప్రతీక రావల్, హర్మన్‌ప్రీత్ సింగ్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్(వికెట్ కీపర్), యస్తిక భాటియా(వికెట్ కీపర్), దీప్తి శర్మ, శ్రీచరణి, వైష్ణవి శర్మ, క్రాంతి గౌడ్, నందని శర్మ, జింతిమణి, సయాలి.

టీ20 జట్టు: స్మృతి మంధాన(కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా, హర్మన్‌ప్రీత్, నిక్కీ ప్రసాద్, రిచా ఘోష్, కమలిని, అనుష్క శర్మ, దీప్తి శర్మ, శ్రీచరణి, ప్రేమ రావత్, అమన్‌జ్యోత్, క్రాంతి, నందని, రేణుక, అరుంధతి, సయాలి.



రెండు బృందాలుగా విడిపోనున్న భారత కోచింగ్ బృందం



భారత జట్టు కోచింగ్ సిబ్బంది రెండుగా విడిపోనుంది. న్యూజిలాండ్‌తో మూడో వన్డే మ్యాచ్ అనంతరం భారత కోచింగ్ స్టాఫ్ రెండు గ్రూపులుగా విడిపోనుంది. హామిల్టన్ వేదికగా మంగళవారం జరగబోయే మూడో మ్యాచ్‌కు ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో టీమ్ ఇండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వన్డే జట్టుతోనే ఉంటాడని, కోచింగ్ స్టాఫ్‌లో కొందరు మాత్రం టెస్టు బృందంతో కలిసి వెలింగ్టన్‌కు చేరుకొంటారని సితాన్షు వెల్లడించాడు.

వన్డే ప్రపంచకప్2027ను దృష్టిలో ఉంచుకుని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, స్పిన్ బౌలింగ్ కోచ్ సాయిరాజ్ బహుతులే వన్డే జట్టుతో పాటే చివరి రెండు మ్యాచ్‌లు జరగనున్న మౌంట్ మాంగనూయికి వెళ్లనున్నారు. మిగిలిన రెండు వన్డేలకు వీరు ఇద్దరూ జట్టుకు మార్గదర్శనం చేయనున్నారు.

మరోవైపు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్, ఫాస్ట్ బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్, తదితర సిబ్బంది నవంబర్ 19 నుంచి ప్రారంభంకానున్న తొలి టెస్ట్ మ్యాచ్ కోసం నేరుగా వెల్లింగ్టన్‌కు పయనం కానున్నారు. అక్కడ టెస్ట్ జట్టు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న ప్రీ సీరీస్ క్యాంప్‌లో వీరు భాగం కానున్నారు. పరిస్థితులకు తగినట్లుగా ఆటగాళ్ల ఫిట్‌నెస్, ప్రాక్టీస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రస్తుతానికి ఇది ప్లాన్. ముందుగా చెప్పినట్లు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ నిర్ణయమే ఫైనల్. అది కూడా మారే అవకాశం లేకపోలేదు. టెస్టు స్క్వాడ్ ప్రాక్టీస్, ఆటగాళ్ల ఫిట్నెస్ వంటి అంశాలపై మేం వర్కౌట్ చేస్తామని కోటక్ తెలిపారు.

ఖవాజా వ్యాఖ్యలు నూరుశాతం వాస్తవం: వార్నర్



2018లో దక్షిణాఫ్రికా వేదికగా జరిగి.. క్రికెట్ ప్రపంచాన్ని కుదిపేసిన బాల్ ట్యాంపరింగ్(శాండ్‌పేపర్ గేట్) వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. బాల్ టాంపరింగ్ కు పాల్పడ్డారంటూ అప్పటి ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్ తోపాటు బౌలర్ కామెరూన్ బాన్ క్రాఫ్ట్ పై వేటు పడింది. ఈ వ్యవహారంపై ఇటీవలే ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ ఉస్మాన్ ఖవాజా చేసిన వ్యాఖ్యలకు మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ మద్దతిచ్చాడు. శాండ్‌పేపర్ వాడుతున్నట్లు కేవలం ముగ్గురికే(స్మిత్, వార్నర్, బాన్‌క్రాఫ్ట్) తెలుసన్న క్రికెట్ ఆస్ట్రేలియా వాదన అబద్ధమని, ఆ సిరీస్‌లోని ఆసీస్ జట్టు మొత్తానికి ఆ విషయం తెలుసని ఖవాజా తన ఆత్మకథ పుసక్తంలో ప్రస్తావించాడు. బాల్ టాంపరింగ్ వివాదంలో కేవలం ముగ్గురినే బాధ్యులను వేయడం సరికాదు. ఈ విషయం జట్టులోని ఆటగాళ్లతోపాటు సహాయక సిబ్బందికి కూడా తెలుసు. దక్షిణాఫ్రికాతో మూడో టెస్టులో మాత్రమే కాకుండా రెండో మ్యాచ్లోనూ శాండ్ పేపర్‌ను ఉపయోగించడం జరిగింది. స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, కామెరూన్ బాన్ క్రాఫ్ట్ లను మాత్రమే కాకుండా.. జట్టుగా అందరూ బాధ్యత తీసుకోవాల్సిందని ఖవాజా వ్యాఖ్యానించాడు.

కాగా ఖవాజా చెప్పిన మాటలన్నీ వందశాతం నిజమని తాజాగా వార్నర్ వెల్లడించాడు. ఎనిమిదేళ్లుగా ఆ విషయాల గురించి మాట్లాడలేదని, ఎప్పటికైనా నిజాలు బయటకు రావాల్సిందేనని స్పష్టం చేశాడు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ వీడియోను విడుదల చేశాడు. ఈ బాల్ ట్యాంపరింగ్ విషయం గురించి నేను మాట్లాడి ఎనిమిదేళ్లు అవుతోంది. ఉస్మాన్ ఖవాజాకు నా పూర్తి మద్దతు ఉంది. అప్పట్లో జరిగిన విచారణ ప్రక్రియ చాలా హడావుడిగా, లోపభూయిష్టంగా సాగింది. కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ పక్కనే ఉస్మాన్ ఖవాజా కూర్చున్నాడు. అయినా అతడిని విచారించలేదు. ఇది సమగ్ర దర్యాప్తు ఎలా అవుతుంది? ఖవాజా చెప్పిన ప్రతి విషయం 100 శాతం నిజం. అసలు నిజం ఎప్పటికైనా బయట పడుతుందన్నాడు.


చైతన్య రథం
సినిమా
మంగళవారం 10 నవంబరు 2026 X

మిస్టరీ, ఉత్కంఠ కలబోత 'ఆర్.ఎక్స్'



భారతీయ సినిమా రంగంలోని రెండు ప్రముఖ సంస్థలు చేతులు కలిపి ఓ ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాయి. దర్శకుడు లోకేష్ కనగరాజ్ జీ స్క్వాడ్, ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్‌తో కలిసి 'ఆర్.ఎక్స్' చిత్రాన్ని రూపొందిస్తోంది. రెజీనా కసాండ్రా, నాజర్, రమేష్ తిలక్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దీపావళి సందర్భంగా విడుదల చేశారు. వివిధ భాషల్లో తన నిర్మాణ సంస్థ పరిధిని విస్తరిస్తున్న మైత్రీ మూవీ మేకర్స్, తమిళ చిత్రసీమలోనూ తనదైన ముద్ర వేస్తోంది. అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ', 'మొదరాత్రి' వంటి చిత్రాలతో తమిళంలోనూ అలరించింది. వివిధ భాషల్లో సినిమాలు నిర్మిస్తూ పాన్ ఇండియా స్థాయిలో తన నిర్మాణ ప్రస్థానాన్ని విస్తరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

'ఆర్.ఎక్స్.' కోసం లోకేష్ కనగరాజ్‌కు చెందిన జి స్క్వాడ్‌తో కలిసి పనిచేయడం ద్వారా విభిన్నమైన కథలను ప్రోత్సహించడంతో పాటు, కొత్త క్రియేటివ్ పార్ట్‌నర్‌షిప్స్‌కు మద్దతు ఇవ్వాలని మైత్రీ మూవీ మేకర్స్ భావిస్తున్నట్టు అర్థమౌతోంది. తాజాగా వచ్చిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రెజీనా కసాండ్రా ప్రధాన ఆకర్షణగా నిలిచారు. 'ట్రూత్ ఆల్వేస్ డిమాండ్స్ ఎ వాయిస్!' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో విడుదలైన ఈ పోస్టర్ మిస్టరీ, ఉత్కంఠను పెంచుతోంది. రెజీనా పవర్‌ఫుల్ లుక్ ఆమె పాత్రపై ఆసక్తిని కలిగిస్తోంది. 'సిల నేరంగళిల్ సిల మనిధర్గల్', 'బాంబ్' వంటి చిత్రాలతో తనదైన కథన శైలికి గుర్తింపు తెచ్చుకున్న విశాల్ వెంకట్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ మొత్తాన్ని చెన్నైలో పూర్తి చేశారు. దీంతో ప్రధాన చిత్రీకరణ విజయవంతంగా ముగిసింది.



13న బాలయ్య 'దాదా ధమాకా'...

నటసింహం నందమూరి బాలకృష్ణ హీరోగా, గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భారీ యాక్షన్ చిత్రం 'దాదా'. బాలయ్యకు జోడీగా కాజల్ అగర్వాల్ నటిస్తుండగా మంచు మనోజ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. డిసెంబర్ 24న 'దాదా' థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో నవంబరు 13న ఫస్ట్ సింగిల్.. 'దాదా ధమాకా' అనే పాటను విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ పాటలో నర్గీస్ ఫక్రీ నర్తించనున్నారని తెలుపుతూ.. సోమవారం పోస్టర్‌ని విడుదల చేశారు.

'రామాయణ' రికార్డు వసూళ్లు!



బాక్సాఫీస్ వద్ద ఇప్పుడు ఎక్కడ చూసినా 'రామాయణ' నామస్మరణే వినిపిస్తోంది. రణ్‌బీర్ కపూర్ రాముడిగా భారీ బడ్జెట్‌తో నితేశ్ తివారీ దర్శకత్వంలో ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ ప్రైమ్ ఫోకస్ అధినేత నమిత్ మల్హోత్రా నిర్మించిన ఈ పౌరాణిక దృశ్యకావ్యం ఇటు దేశ వ్యాప్తంగా, అటు ఓవర్సీస్ మార్కెట్లలో సరికొత్త సంచలనాలు సృష్టిస్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్ల మార్కుకు చేరువైంది. ముఖ్యంగా దీపావళి సందర్భంగా భారీ వసూళ్లు సాధించి సరికొత్త రికార్డును సృష్టించింది. దీపావళి ఆదివారం కావడంతో సినిమాకు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభించింది. ఒక్కరోజే భారత్‌లో రూ.56.15 కోట్ల నెట్ వసూళ్లను సాధించింది. దీంతో 2023లో సల్మాన్ ఖాన్ నటించిన 'టైగర్ 3' దీపావళి రోజు సాధించిన రూ.44.50 కోట్ల రికార్డును అధిగమించింది. ఇప్పటి వరకూ దీపావళికి బాలీవుడ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాల జాబితాలో మొదటి స్థానంలో నిలిచింది.

'రామాయణ' విడుదలైన తొలి రోజు భారత్‌లో రూ.64.85 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. రెండో రోజు రూ.48.05 కోట్లు, మూడో రోజు రూ.69.80 కోట్లు రాబట్టింది. ఇక నాలుగో రోజు దీపావళి సందర్భంగా రూ.56.15 కోట్లను ఖాతాలో వేసుకుంది. దీంతో భారత్ లో మొత్తం నెట్ వసూళ్లు రూ.238.85 కోట్లకు చేరాయి. ఓవర్సీస్ లో రూ.214 కోట్ల గ్రాస్ వసూళ్లు రావడంతో ప్రపంచవ్యాప్తంగా మొత్తం కలెక్షన్లు రూ.499.20 కోట్లకు చేరుకున్నాయి.

థియేటర్లలో రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతున్న ఈ చిత్రం.. ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ 'బుక్‌మైషో'లో ఆల్ టైమ్ రికార్డును నమోదు చేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. తాజా గణాంకాల ప్రకారం బుక్‌మైషోలో ఒక గంట వ్యవధిలోనే ఏకంగా లక్షా 22 వేలకు పైగా టికెట్లు అమ్ముడై సరికొత్త రికార్డు నమోదైంది. గతంలో బాలీవుడ్ భారీ చిత్రం 'ధురంధర్ 2' పేరిట ఉన్న గంటకు లక్షా 9 వేల టికెట్ల రికార్డును 'రామాయణ' అలవోకగా తుడిచిపెట్టేసింది. ఒక భారతీయ సినిమాకు ఒక గంటలో ఇంత భారీ స్థాయిలో టికెట్లు బుక్ కావడం భారత చలనచిత్ర చరిత్రలోనే ఇదే ప్రథమం. ఈ జోరు చూస్తుంటే రాబోయే రోజుల్లో బాక్సాఫీస్ వద్ద మరిన్ని మైలురాళ్లను 'రామాయణ' అధిగమించడం ఖాయంగా కనిపిస్తోంది.

అత్యాధునిక వీఎఫ్ఎక్స్ హంగులు, కనీవినీ ఎరుగని భారీ స్కేల్‌తో రూపొందిన ఈ చిత్రంలో సీతాదేవిగా సాయి పల్లవి, రావణాసురుడిగా రాకింగ్ స్టార్ యశ్ తమ నటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నారు. సీతాదేవి పాత్రకి సంబంధించి సాయి పల్లవి విషయంలో నెగిటివ్ ట్రెండ్ నడుస్తున్నా.. టికెట్ల బుకింగ్‌పై అది ఎలాంటి ప్రభావం చూపలేకపోవటం విశేషం. ఇంకా ఈ సినిమాలో రవి దూబే, సన్నీ డియోల్, అరుణ్ గోవిల్, లారా దత్తా, ఇందిరా కృష్ణన్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, వివేక్ ఒబెరాయ్, కునాల్ కపూర్, షీబా చద్దా, అనుపమ్ ఖేర్ వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు. గ్లోబల్ లెజెండ్ హన్స్ జిమ్మర్, ఆస్కార్ విజేత ఎ.ఆర్. రెహమాన్ సంయుక్తంగా ఈ సినిమాకు సంగీతం అందించారు.

వెంటనే తొలగించండి..

'రామాయణ' పైరసీపై చిత్ర బృందం తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేసింది. థియేటర్లలో సినిమాను రికార్డు చేసి, ఆ వీడియోలను సోషల్ మీడియాలో లీక్ చేసిన విషయాన్ని బాంబే హైకోర్టు తీవ్రంగా పరిగణిస్తున్నట్లు లీగల్ నోటీసు ద్వారా తాజాగా వెల్లడించింది. ఈ విషయంపై ఇటీవల బాంబే హైకోర్టు కఠిన ఆదేశాలు జారీ చేసిందని నోటీసులో పేర్కొంది.

అనుమతి లేకుండా సినిమాను రికార్డు చేసి అప్లోడ్ చేయడం, ఇతరులకు షేర్ చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేసింది. ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని అందులో తెలిపింది. ఇప్పటికే ఎవరైనా ఇలాంటి ఫుటేజ్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ఉంటే. వెంటనే వాటిని తొలగించాలని హెచ్చరించింది. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే నేరుగా క్రిమినల్, సివిల్, కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకుంటామని చిత్ర బృందం స్పష్టం చేసింది.

'అలియాస్ రుక్మిణి' షూటింగ్ పూర్తి



నేచురల్ స్టార్ నాని సమర్పణలో తెరకెక్కిన 'కోర్ట్ – స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' ఘన విజయానంతరం ఆయన యూనాని మస్ ప్రొడక్షన్స్ రెండో చిత్రంగా 'అలియాస్ రుక్మిణి' చిత్రం నిర్మించారు. నితిన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీప్తి గంటా నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 4న విడుదల కాబోతోంది.

ఈ సినిమా గురించి, నితిన్ గురించి నాని మాట్లాడుతూ, 'నా కెరీర్ ప్రారంభం నుంచే, నేను సక్సెస్ కాకముందే నితిన్ నాకు ఎంతో సపోర్ట్ చేశారు. 'జయం', 'ఇష్క్', 'గుండెజారి గల్లంతయ్యిందే' వంటి సినిమాల్లో నితిన్‌ను ప్రేక్షకులు ఎంతగా అభిమానించారో మనందరికీ తెలుసు. ఇప్పుడు 'అలియాస్ రుక్మిణి'తో మరోసారి అదేస్థాయిలో ఆదరణ పొందే సినిమా చేస్తున్నామనే నమ్మకం ఉంది. ఇది చాలా అందమైన ప్రేమకథ. మంచి కథ, అద్భుతమైన టెక్నీషియన్స్‌తో కలిసొస్తే అలాంటి ప్రేమకథలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. ప్రేక్షకులు చాలా కాలం గుర్తుంచుకునే సినిమా చేయబోతున్నాం. ఈ సినిమా చాలా ప్రత్యేకంగా నిలుస్తుందనే నమ్మకం ఉందన్నారు. అన్నారు.

దర్శకుడు మురళీకాంత్ దేవసోత్ మాట్లాడుతూ, 'ఈ కథను నాని అన్నకు చెప్పిన వెంటనే 'చేద్దాం' అనడంతో ఈ ప్రయాణం మొదలైంది. అప్పటి నుంచి అన్నీ చాలా అందంగా జరుగుతున్నాయి. నితిన్ అన్న ఈ సినిమాలో భాగం కావడం నా కల నిజమైనట్టే. అదే సమయంలో బాధ్యత కూడా మరింత పెరిగింది. మా బెస్ట్ ఇవ్వడానికి మేమంతా ఎంతో కష్టపడ్డామన్నారు.

ఇదిలా ఉంటే... 'అలియాస్ రుక్మిణి' మూవీ షూటింగ్ పూర్తయ్యింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా మేకర్స్ తెలిపారు. షూటింగ్ పూర్తయిన శుభసందర్భంలో హీరో నితిన్, దర్శకుడు మురళీకాంత్, ప్రొడ్యూసర్ గంటా దీప్తి ఛీర్స్ చెప్పుకున్నారు.

గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా మమ్ముట్టి 'మేళా'

మలయాళ అగ్ర కథానాయకుడు మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మేళా'. నితీష్ సహదేవ్ దర్శకత్వం వహిస్తున్నారు. దీపావళి సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో మమ్ముట్టితో పాటు చిత్రబృందం సభ్యులంతా టపాసుల దుకాణం నేపథ్యంలో కనిపిస్తున్నారు. చేతుల్లో బాణసంచా పట్టుకుని సందడి చేస్తున్న ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమాని తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. విష్ణు విజయ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. మమ్ముట్టి నిర్మాణ సంస్థ రూపొందిస్తోంది.

